thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 124| జగిత్యాల | బుధవారం 05 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

యూఏఈ వేదికగా మహిళ టీ20 ఆసియా కప్



11

## ఈ20 పెట్రోల్‌తో బహుళ ప్రయోజనాలు




- రైతులకు లాభం, దిగుమతులకు చెక్!
- కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పర్యావరణ పరిరక్షణకు ఊతం
- పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టత!

4

## నీట్ ఉద్యమం మళ్లీ భగ్గుమంది!



- బిహార్‌లో విద్యార్థుల మరోసారి భారీ ఆందోళన
- ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి యత్నం..
- వాటర్ కేనన్లతో చెదరగొట్టిన పోలీసులు

2

## ఒప్పందమా.. లొంగుబాటా!

- ఇరాన్‌కు ట్రంప్ తుది హెచ్చరిక
- చర్చలకు రాకుంటే కఠిన చర్యలేనన్న అమెరికా అధ్యక్షుడు
- టెహ్రాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయ వ్యూహాలపై దృష్టి
- హోర్ముజ్ జలసంధిపై అమెరికా ఆధిపత్యమంటూ వ్యాఖ్యలు



4

# పోలీస్ నియామకాల్లో కుట్రలకు చెక్!

### 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై సీఎం రేవంత్ అత్యవసర సమీక్ష

- ప్రశ్నపత్రాల నుంచి ఫలితాల వరకు పూర్తి పారదర్శకతకు ఆదేశాలు
- దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా




తెలంగాణలో పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను తీవ్రంగా ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియను భంగపరచేందుకు కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర స్వార్థ శక్తులు కుట్రలు పన్నుతున్నట్లు నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్, సీనియర్ అధికారులతో సీఎం సచివాలయంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.

వివరాలు 2వ పేజీలో..



# కల్తీ మసాలాల గుట్టురట్టు!

- 13 సంస్థలపై హెచ్-ఫాస్ట్ మెరుపుదాడులు
- 25 టన్నుల కల్తీ మసాలాలు.. 89 టన్నుల ముడి పదార్థాల స్వాధీనం
- క్యాన్సర్ కారక రసాయనాల వినియోగం..
- కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

వివరాలు 2వ పేజీ

## అంబులెన్స్ సిబ్బంది దాష్టీకం

- మృతదేహాన్ని మార్గమధ్యలో వాహనాన్ని అడ్డగించి వాగ్వాదం
- 'మా అంబులెన్స్‌లోనే తీసుకెళ్లాలి' అంటూ పట్టుబట్టిన సిబ్బంది
- బాధిత కుటుంబం ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి

2




## 'వర్షాలు పడొద్దని క్షుద్ర పూజలు!'

- హరీశ్ రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు
- 'ఆధారాలు మా వద్ద ఉన్నాయి.. ప్రజలకు నిజాలు చెప్పాలి' డిమాండ్

3



## చురుగ్గా నైరుతి

- రాష్ట్రానికి ఎల్లో అలర్ట్..!
- హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం
- ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే సూచనలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

2



## గాలిలో దీపంలా వైద్య విధాన పరిషత్

- అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు
- ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు
- కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్
- సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు

3



## కాళేశ్వరం ప్రాముఖ్యత మరోసారి రుజువైంది

- ఎస్సారెస్పీకి గోదావరి జలాల ఎత్తిపోతలపై కేటీఆర్ హర్షం
- 'కాంగ్రెస్ ప్రచారాన్ని నీరే ఖండిస్తోంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్యలు

3



## కేసు నమోదు చేస్తే అధికారుల బదిలీ ఎందుకు?

- 'మోదీపై పోస్టులకు కేసు పెడితే శిక్ష.. రాహుల్‌పై అయితే వదిలేస్తారా?'
- డీసీపీ ఆనంద్‌బాబు బదిలీపై సీఎంను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి

3



## నిమ్స్‌లో యువతిపై అసభ్య ప్రవర్తన!

- చికిత్స పొందుతున్న బాధితురాలిని వేధించిన అటెండర్
- బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

2





# నిమ్స్‌లో యువతిపై అసభ్య ప్రవర్తన..!

**చికిత్స పొందుతున్న బాధితురాలిని వేధించిన అటెండర్**

**బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు**

**నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**

**హైదరాబాద్, ఆగస్టు 4:** నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిపై ఓ రోగి అటెండర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో బాధిత య-ువతిని కుటుంబ సభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి 4 గంటల మధ్య పక్క బెడ్‌లో ఉన్న మరో రోగి అటెండర్ యువతిపై అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన యువతి, మరుసటి రోజు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వెల్లడించింది. అనంతరం యువతి తండ్రి, ఆర్ఎంపీ వైద్యుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రిలోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితుడి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# చురుగ్గా నైరుతి..

## రాష్ట్రానికి ఎల్లో అలర్ట్..!

**హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం**

**ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే సూచనలు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**



**హైదరాబాద్, ఆగస్టు 4:** నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో తెలంగాణలో మళ్లీ వర్షాలు విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా క్యూములో నింబస్ మేఘాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో కురిసిన వర్షాలు సాధారణ జనజీవనాన్ని ప్రభావితం చేశాయి. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిసినట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని వాతావరణ శాఖ సూచించింది. స్థానిక పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది.

# మృతదేహం తరలింపుపై అంబులెన్స్ సిబ్బంది దౌర్జన్యం!

**మార్గమధ్యలో వాహనాన్ని అడ్డగించి వాగ్వాదం**

**బాధిత కుటుంబం ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి**

**మంచిర్యాల, ఆగస్టు 4:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో మృతదేహం తరలింపు విషయంలో అంబులెన్స్ సిబ్బంది వ్యవహరించిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. ఇంటికి తీసుకెళ్తున్న మృతదేహాన్ని మార్గమధ్యలో అడ్డగించి, తమ అంబులెన్స్‌లోనే తరలించాలని ఒత్తిడి తెచ్చిన ఘటన బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం, పట్టణంలోని పి.ఆర్. శంకరయ్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెలగపూడి నాగభూషణం(65) సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికంగా అందుబాటులో ఉన్న అంబులెన్స్‌లో వసుధ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయన అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, వారు మరో అంబులెన్స్‌లో ఇంటికి తీసుకెళ్తుండగా ఆస్పత్రి వద్ద ఉన్న అంబులెన్స్ సిబ్బంది వాహనాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. "ఇక్కడ అంబులెన్స్ పాయింట్ మాది.. మా వాహనంలోనే మృతదేహాన్ని తీసుకెళ్లాలి" అంటూ వాగ్వాదానికి దిగారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే బయలుదేరిన అంబులెన్స్‌ను బలవంతంగా తిరిగి ఆస్పత్రికి రప్పించి, తమ అంబులెన్స్‌లోనే మృతదేహాన్ని తరలించినట్లు బాధితులు ఆరోపించారు. "ఇక్కడ మేమే సీనియర్లం.. మేము చెప్పిందే నడవాలి" అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న సమయంలో ఇలాంటి ఘటన జరగడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# పోలీస్ నియామకాల్లో కుట్రలకు చెక్!

- 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై సీఎం రేవంత్ అత్యవసర సమీక్ష
- ప్రశ్నపత్రాల నుంచి ఫలితాల వరకు పూర్తి పారదర్శకతకు ఆదేశాలు
- దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా



**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోలీస్ పోస్టుల భర్తీ ప్రక్రియకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో ముఖ్యమంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. కొన్ని రాజకీయ పార్టీలు, ఇతర స్వార్థపూరిత శక్తులు నియామక ప్రక్రియను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని నిఘా వర్గాలు నివేదించడంతో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ప్రభుత్వ, పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. నియామక ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియలన్నింటిలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోచింగ్ సెంటర్ల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నియామక పరీక్షలకు సంబంధించిన తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియా, ఇతర వేదికల ద్వారా వ్యాప్తి చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలపై సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేకంగా నిఘా పెట్టాలని సీఎం ఆదేశించారు. పరీక్షల ప్రక్రియ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# గాలిలో దీపంలా వైద్య విధాన పరిషత్

**ప్రత్యేక వైద్య సేవలు దెబ్బతింటున్నాయన్న హరీశ్‌రావు**

**పూర్తిస్థాయి కమిషనర్ లేక 184 ఆస్పత్రులు అగమ్యగోచరమని విమర్శ**



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పూర్తిస్థాయి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారిందని ఆరోపించారు. మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించిన హరీశ్‌రావు.. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో పరిషత్ పరిధిలోని మాతా-శిశు ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు కలిపి మొత్తం 184 ప్రభుత్వ ఆస్పత్రుల పరిపాలన దెబ్బతిందన్నారు. ఆస్పత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యత, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత వంటి అంశాలను పర్యవేక్షించే యంత్రాంగమే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు ప్రజలు నాణ్యమైన వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైద్య సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలు, ఇతర పరిపాలనా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వ హయాంలో వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించామని గుర్తు చేశారు. అయితే మూడేళ్లు గడిచినా సేవా నిబంధనలు రూపొందించకపోవడం, విలీన ప్రక్రియను పూర్తి చేయకపోవడం వల్ల వైద్యులు, ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, రోడ్డెక్కి నిరసనలు తెలిపినా స్పందన లేదని విమర్శించారు. వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని ఆయన డిమాండ్ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి సేవా నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించాలని, పూర్తిస్థాయి అధికారిని వెంటనే నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు కోరారు.

# కేసు నమోదు చేస్తే అధికారుల బదిలీ ఎందుకు?

- 'మోదీపై పోస్టులకు కేసు పెడితే శిక్ష.. రాహుల్‌పై అయితే వదిలేస్తారా?'
- డీసీపీ ఆనంద్‌బాబు బదిలీపై సీఎంను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అభ్యంతరకర పోస్టులు చేసిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కేనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. అలాంటి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్‌బాబును తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. చట్టప్రకారం విధులు నిర్వహించిన అధికారిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శిక్షించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ సూచనల మేరకే డీసీపీని బదిలీ చేశారని విమర్శించారు. చట్టాన్ని అమలు చేసే అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఆందోళనకరమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్.. తెలంగాణలో మాత్రం చట్టపరంగా కేసులు నమోదు చేసిన అధికారులనే శిక్షిస్తోందని అన్నారు. రాహుల్ గాంధీపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తుందా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా సింగరేణికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. నైనీ, తాడిచర్ల-2, మణుగూరు బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించినట్లు తెలిపారు. మణుగూరు బ్లాక్ కోసం పలువురు పోటీ పడినా, సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం కేటాయింపు నిర్ణయం తీసుకుందని చెప్పారు. కొత్త బొగ్గు బ్లాక్‌లతో సింగరేణికి దీర్ఘకాలిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు సింగరేణి ప్రయోజనాలను దెబ్బతీశాయని ఆరోపించిన కిషన్‌రెడ్డి.. కేంద్ర ప్రభుత్వం మాత్రం సంస్థ అభివృద్ధి, విస్తరణకు కట్టుబడి ఉందని అన్నారు.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాల గుట్టురట్టు..!

- 13 సంస్థలపై హెచ్-ఫాస్ట్ మెరుపుదాడులు
- 25 టన్నుల కల్తీ మసాలాలు.. 89 టన్నుల ముడి పదార్థాల స్వాధీనం
- క్యాన్సర్ కారక రసాయనాల వినియోగం..
- కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్ -ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ-ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# విద్యారంగ సమస్యలపై దశలవారీ పోరాటం

- 7న నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసనలు
- 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు
- ఉపాధ్యాయ సంఘాల జేఏసీ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిర్ణయించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు నిర్వహించాలని యూఎస్‌పీసీ నిర్ణయించింది. ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, పీఆర్‌సీ ప్రకటించేదాకా ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యూఎస్‌పీసీ పిలుపునిచ్చింది. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండం, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యాయులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి 15శాతం నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యూకేజీ కే పరిమితం చేశారని, ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నడపాలి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12 తర్వాత తమ పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని వారు వాపోయారు. ప్రాథమిక విద్యకు అవరోధంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఈవో, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీవో 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల పక్రియ చేపట్టాలని, టెట్ లో సర్వీసు వెయిటేజీ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను స్జబెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బీసీ, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్, ఎయిడెడ్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, జీవో 190 అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (ఆం), పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను ప్రతినెలా రూ. 2000 కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో అమలుకు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చావ రవి, ఏ వెంకట్(టీఎస్ యూటీఎఫ్), సీహెచ్ అనీల్ కుమార్, ఎన్ తిరుపతి(టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టీ లింగారెడ్డి(డీటీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ, ఎస్టీ టీఎఫ్), ఎస్ హరికిషన్ (టీటీఏ), బీ కొండయ్య (ఎంఎస్‌టీఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ, ఎస్టీ యూఎస్) పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధికి విద్యే పునాది

- విద్యార్థుల్లో నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించాలి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- వీసీల సమావేశంలో ఉన్నత విద్యాభివృద్ధిపై దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకమని రాష్ట్ర గవర్నర్, తెలంగాణ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం బోధనకే పరిమితం కాకుండా సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం రాజ్‌భవన్‌లో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్), నషా ముక్త్ యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల కార్యకలాపాలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. దేశ మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలంటే యువతకు విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలకు విశ్వవిద్యాలయాలు తమ సేవలను మరింత విస్తరించాలని సూచించారు. సమావేశంలో పలువురు వైస్ ఛాన్సలర్లు మాట్లాడుతూ.. మొదటి తరం విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, హెచ్ఐవీ నివారణ, రక్తదాన ప్రోత్సాహం, జీవన నైపుణ్యాల పెంపొందింపులో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, ప్రభుత్వం, పౌర సమాజ సంస్థలు, రాజ్‌భవన్‌తో సమన్వయంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఉన్నత విద్యారంగానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ పక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.





# సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

**బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చర్యలు**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్ట్‌ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణెళి ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



# వర్షాలు పడొద్దని క్షుద్ర పూజలు!

**హరీశ్ రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు**

**'ఆధారాలు మా వద్ద ఉన్నాయి.. ప్రజలకు నిజాలు చెప్పాలి' డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకుండా, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడాలని కోరుతూ హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొంటూ మాజీ మంత్రి తనపై వస్తున్న ఆరోపణలకు ప్రజల ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ గౌడ్.. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని, ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని కోరారు. తిరుపతి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవాలయాల్లో ప్రార్థనలు చేయడం సహజమేనని, కానీ ప్రజలకు కీడు జరగాలని కోరుతూ క్షుద్ర పూజలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మహేశ్ గౌడ్ విమర్శించారు. రాజకీయ స్వార్థం కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌కు లీగల్ నోటీసులు పంపించారని పేర్కొన్న ఆయన, అలాంటి నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరులతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం జరిగిందని, ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలు ఆ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి ఏమి చేశారో ప్రజలకు వెల్లడించాలని హరీశ్ రావును డిమాండ్ చేసిన మహేశ్ గౌడ్.. మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలను సమాజం సమర్థించదని అన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఆచారాలను ఇప్పటికీ నమ్ముతున్నప్పటికీ, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

# టీపీసీసీ చీఫ్‌కు హరీశ్ లీగల్ నోటీసు

**క్షుద్ర పూజల ఆరోపణలు వెనకితీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 4 :** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు లీగల్ నోటీసులు పంపారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు నిర్వహించారని మహేశ్ చేసిన వ్యాఖ్యలు పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని పేరొంటూ తన న్యాయవాది ద్వారా నోటీసులిచ్చారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవి తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠకు నష్టం కలిగించే ఉద్దేశంతో చేసినవేనని పేరొన్నారు. ఆధారాల్లేని ఆరోపణలు కాంగ్రెస్ నాయకుల మానసిక అసమతుల్యతకు నిదర్శనమని హరీశ్ తరఫు న్యాయవాది వ్యాఖ్యానించారు. మహేశ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనకి తీసుకొని క్షమాపణ చెప్పాలని, లేకపోతే పరువు నష్టం దావా వేస్తామని న్యాయవాది స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాముఖ్యత మరోసారి రుజువైంది

**ఎస్సారెస్పీకి గోదావరి జలాల ఎత్తిపోతలపై కేటీఆర్ హర్షం**

**'కాంగ్రెస్ ప్రచారాన్ని నీరే ఖండిస్తోంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలను రివర్స్ పంపింగ్ ద్వారా ఎత్తిపోస్తుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు ఈ పరిణామం సమాధానమని, ప్రాజెక్టు ప్రాముఖ్యత మరోసారి రుజువైందని పేర్కొన్నారు. మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి శ్రీరాంసాగర్ వరద కాలువకు తరలిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ తెలంగాణ రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాగా నిలుస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆరోపణలు, దుష్ప్రచారాలు చేసినా రైతులు తమ పొలాలకు చేరుతున్న నీటినే చూస్తున్నారని, వాస్తవాలు వారికి బాగా తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు చేరుతున్న దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ కాంగ్రెస్ విమర్శలను ఆయన తిప్పికొట్టారు.

## సంపాదకీయం



# బీజేపీ ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

**కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కీలక దశకు చేరుకుంది. ప్రస్తుతం పార్టీ, ప్రభుత్వం రెండింటి నిర్ణయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలదే కీలక పాత్ర. కాబట్టి వారు పరిస్థితులను సకాలంలో అంచనా వేయడం అవసరం. ఎందుకంటే దేశంలో పాలనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అసంతృప్తి క్రమంగా పెరుగుతోందనే సంకేతాలు ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సూచిస్తున్నాయి.**

ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉంది. మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం గుజరాత్‌లో మాత్రమే విజయాన్ని నమోదు చేయగా, అధికారంలో ఉన్న బీహార్, మధ్యప్రదేశ్‌లలో పరాజయం పాలైంది. సాధారణంగా అధికార పార్టీలకు ఉప ఎన్నికల్లో అనుకూల వాతావరణం ఉంటుందనే రాజకీయ సూత్రానికి భిన్నంగా వచ్చిన ఈ ఫలితాలు ప్రజాభిప్రాయంలో మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఇక నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. విద్యార్థుల నిరసనలు, పార్లమెంట్ ముట్టడి వంటి పరిణామాల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని కేవలం రాజకీయ పరిణామంగా కాకుండా, విద్యా వ్యవస్థపై యువతలో పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతిబింబంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ప్రారంభంలో ఈ ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోని ప్రధాన స్రవంతి మీడియా కూడా చివరకు దాని ప్రాధాన్యాన్ని గుర్తించాల్సి వచ్చింది. చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, విద్యార్థి ఉద్యమాలను ఏ ప్రభుత్వం తేలికగా తీసుకున్నా దాని రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో జరిగిన ప్రజా ఉద్యమాల నుంచి తెలంగాణ ఉద్యమం వరకు యువత పోషించిన పాత్ర కీలకమైనది. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత ఆకాంక్షలు, ఆవేదనలను విస్మరించడం ఏ ప్రభుత్వానికీ శ్రేయస్కరం కాదు.

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 242 సీట్లకే పరిమితం కావడం కూడా ప్రజలు ఇచ్చిన ఒక హెచ్చరికగానే విశ్లేషించాలి. తాజాగా ఉప ఎన్నికల ఫలితాలు ఆ హెచ్చరికను మరింత బలపరిచినట్లు కనిపిస్తున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పెరుగుతున్న పన్నుల భారం, విద్యా, వైద్య రంగాల్లో సామాన్యులకు పెరుగుతున్న ఆర్థిక భారాలు ప్రజల్లో అసంతృప్తికి కారణాలుగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక ప్రత్యేక రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విజయం కేవలం ఒక నియోజకవర్గ ఫలితం మాత్రమే కాదు, బీజేపీకి బలమైన రాజకీయ హెచ్చరికగా కూడా పలువురు విశ్లేషిస్తున్నారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానంలో పరాజయం ఎదురుకావడం, ముఖ్యంగా అగ్రవర్ణ ఓటర్ల ప్రాబల్యం ఉన్న నియోజకవర్గంలో ఈ ఫలితం రావడం పార్టీకి ఆలోచన కలిగించే అంశం. నీట్ వివాదం, విద్యార్థుల ఆందోళనలు, నిరుద్యోగ సమస్య, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలు యువత ఓటింగ్ ధోరణిపై ప్రభావం చూపినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. యువతతో పాటు మధ్యతరగతి, వృద్ధులు కూడా మార్పు కోరుకుంటున్నారనే సంకేతాలు ఈ ఎన్నికల్లో కనిపించాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు బలహీనంగా ఉండొచ్చు కానీ, ప్రతిపక్ష భావజాలం మాత్రం బలంగా ఉందన్న ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్య కూడా ఈ నేపథ్యంలో ప్రస్తావనీయమే. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు కేవలం విజయాలు, పరాజయాలను మాత్రమే సూచించవు. అవి ప్రజల మనోభావాలకు అద్దం పడతాయి. అందువల్ల ఉప ఎన్నికల ఫలితాలు, విద్యార్థి ఉద్యమాలు, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం సీరియస్‌గా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. విద్యా రంగంలో సంస్కరణలు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, ధరల నియంత్రణ, పన్నుల భారాన్ని తగ్గించడం, సామాన్యులకు అందుబాటులో విద్యా, వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో వేగంగా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయగలుగుతారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, కాలానుగుణంగా విధానాల్లో మార్పులు తీసుకురాగలిగినప్పుడే ఏ రాజకీయ పార్టీ అయినా దీర్ఘకాలికంగా ప్రజల మద్దతును నిలబెట్టుకోగలదనేది ప్రజాస్వామ్య చరిత్ర చెప్పే వాస్తవం.



# ఈ20 పెట్రోల్‌తో బహుళ ప్రయోజనాలు

- రైతులకు లాభం, దిగుమతులకు చెక్!
- కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పర్యావరణ పరిరక్షణకు ఊతం
- పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టత!




**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఈ20 పెట్రోల్ పాలసీ అమలు, దాని వల్ల చేకూరే ప్రయోజనాలు, పాత వాహనాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ నిర్ణయం వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థకు, రైతులకు మరియు పర్యావరణానికి బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయని కేంద్రం సమగ్రంగా వివరించింది. ఈ20 ఇంధన పాలసీ వల్ల ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటం తగ్గడంతో పాటు, ప్రతి ఏటా సుమారు 4 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతోందని మంత్రి వెల్లడించారు. అలాగే చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతోందని తెలిపారు. దీనికితోడు సాధారణ ఇంధనంతో పోలిస్తే ఈ20 వాడకం వల్ల కార్బన్ ఉద్గారాలు దాదాపు 30 శాతం వరకు తగ్గి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ20 మిశ్రమ ఇంధనంతో సురక్షితంగా నడుస్తున్నాయని కేంద్రం పేర్కొంది. పాత వాహనాల ఇంజిన్లపై లేదా వాటి విడిభాగాలపై దీనివల్ల ఎలాంటి తీవ్రమైన అసాధారణ అరుగుదల గానీ, పనితీరులో లోపాలు గానీ నమోదవలేదని పరిశోధనల్లో వెల్లడైందని మంత్రి ఉటంకించారు. నీతి ఆయోగ్, ఏఆర్ఏఐ, సియామ్ వంటి సాంకేతిక సంస్థలతో పాటు వాహన తయారీదారులతో సమగ్రంగా సంప్రదించిన తర్వాతే ఈ పాలసీని శాస్త్రీయంగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం వివరించింది.




# విదేశాల్లో దాక్కున్న నేరస్థులపై ఉక్కుపాదం!

- 2019 నుంచి 36 దేశాల నుంచి 274 మంది నిందితులను రప్పించిన కేంద్రం
- రూ.17,874 కోట్ల ఆస్తుల జప్తు.. రూ.18,762 కోట్ల నిధుల రికవరీ
- ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులపై కఠిన చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** విదేశాలకు పారిపోయిన నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. 2019 నుంచి 2026 మధ్యకాలంలో ప్రపంచంలోని 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు రప్పించినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. వీరిలో ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులు, మత్తుపదార్థాల అక్రమ రవాణాదారులతో పాటు హత్య, అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు ఎదుర్కొంటున్న నిందితులు కూడా ఉన్నట్లు తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అత్యాధునిక సాంకేతికత, సమగ్ర నిఘా వ్యవస్థ, అంతర్జాతీయ సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. నేరస్థులను స్వదేశానికి రప్పించడమే కాకుండా, వారి అక్రమ ఆస్తులపై కూడా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద 2019-2026 మధ్యకాలంలో పరారీలో ఉన్న నిందితులకు చెందిన రూ.17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు వెల్లడించింది. అలాగే ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వ్యక్తులకు సంబంధించిన కేసుల్లో రూ.18,762 కోట్ల నిధులను తిరిగి రికవరీ చేసినట్లు తెలిపింది. విదేశాల్లో తలదాచుకున్న నేరస్థుల వేటలో భాగంగా అంతర్జాతీయ పోలీసు సంస్థ ఇంటర్‌పోల్ సహకారాన్ని కూడా భారత్ మరింత విస్తరించింది. ఈ క్రమంలో గడిచిన మూడేళ్లలోనే 501 రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. పరారీలో ఉన్న నేరస్థులను చట్టం ముందు నిలబెట్టడమే కాకుండా, వారి అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకోవడం ద్వారా నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగిస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# ఒప్పందమా.. లొంగుబాటా!

**ఇరాన్‌కు ట్రంప్ తుది హెచ్చరిక**

**చర్చలకు రాకుంటే కఠిన చర్యలేనన్న అమెరికా అధ్యక్షుడు**

**టెహ్రాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయ వ్యూహాలపై దృష్టి**

**హోర్ముజ్ జలసంధిపై అమెరికా ఆధిపత్యమంటూ సంచలన వ్యాఖ్యలు**



**వాషింగ్టన్, ఆగస్టు 4:** ఇరాన్ అణు కార్యక్రమం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టెహ్రాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. అమెరికాతో అణు ఒప్పందానికి అంగీకరించాలని, లేకపోతే పూర్తిగా లొంగిపోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్లో చేసిన సుదీర్ఘ పోస్టులో ఇరాన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇరాన్ చర్చలకు సిద్ధమని గతంలో సంకేతాలు ఇచ్చి, ఇప్పుడు బహిరంగంగా వెనక్కి తగ్గుతోందని ట్రంప్ ఆరోపించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న అణు సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతున్నామని, అయితే ఇరాన్ మాత్రం మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగుతోందని ఇరాన్ చెబుతున్నా, వాస్తవానికి అక్కడ అమెరికాదే పూర్తి ఆధిపత్యమని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు అమెరికా నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయని, ఇరాన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌పై మరింత ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణను సిద్ధం చేయాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తన సైనిక విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. టెహ్రాన్‌ను చర్చల బల్లపైకి తీసుకురావడానికి కొత్త వ్యూహాలు, సంప్రదాయేతర చర్యలపై సూచనలు ఇవ్వాలని సైనికాధికారులను కోరినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. ఇప్పటివరకు అమలు చేసిన వ్యూహాలను సమీక్షిస్తూ, అవసరమైతే మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత వారం ఇరాన్‌పై భారీ సైనిక దాడులు చేపడతామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, ఇతర గల్ఫ్ దేశాల విజ్ఞప్తితో ఆ చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దౌత్యపరమైన ప్రయత్నాలకు చివరి అవకాశం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని ఇరాన్ వినియోగించుకోకపోతే మరింత కఠిన నిర్ణయాలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు, కువైట్, ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన డ్రోన్లు దాడులకు పాల్పడినట్లు సమాచారం. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్‌ను చర్చలకు ఒప్పించే ప్రయత్నాలతోపాటు అవసరమైతే కఠిన సైనిక చర్యలకు కూడా అమెరికా సిద్ధమవుతోందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నీట్ ఉద్యమం మళ్లీ భగ్గుమంది!

- బిహార్‌లో విద్యార్థుల మరోసారి భారీ ఆందోళన
- అరెస్టయిన విద్యార్థుల విడుదల హామీ అమలు కాలేదని ఆరోపణ
- ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి యత్నం..
- వాటర్ కేనన్లతో చెదరగొట్టిన పోలీసులు





**పట్నా, ఆగస్టు 4:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై బిహార్‌లో విద్యార్థుల ఆందోళనలు మరోసారి ఉద్ధృతమయ్యాయి. గత నెలలో జరిగిన నిరసనల సందర్భంగా అరెస్టయిన విద్యార్థులను విడుదల చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపిస్తూ వందలాది మంది విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తలు మంగళవారం పట్నాలో నిరసనకు దిగారు. గాంధీ మైదాన్ నుంచి ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి నివాసానికి ర్యాలీగా బయల్దేరిన ఆందోళనకారులను ఇన్‌కమ్ ట్యాక్స్ చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి నివాసానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే వారిని నిలువరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు ముందుకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించి వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, నిషేధిత ప్రాంతంలోకి చొచ్చుకెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించడంతోనే వాటర్ కేనన్లు వినియోగించాల్సి వచ్చిందని తెలిపారు. గత నెలలో కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన బంద్ సందర్భంగా సుమారు 600 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో సగం మందిని మైనర్లుగా గుర్తించి విడుదల చేయగా, మిగిలిన వారిని జైలుకు తరలించారు. ఆ తర్వాత కేసులను ఉపసంహరించుకుంటామని రాష్ట్ర హోంశాఖ ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎంతమంది విద్యార్థులను విడుదల చేశారో, ఇంకా ఎంతమంది జైలులో ఉన్నారో అధికారిక జాబితా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలకు స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్, బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ మద్దతు ప్రకటించారు. దీంతో నీట్ పేపర్ లీక్ వ్యవహారం బిహార్ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## మృతునికుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ ఆగస్టు 04:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మారేపల్లి నిరంజన్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 5000 వేల రూపాయలు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి 2000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య మాజీ ఎంపీటీసీ నాగుల్ నాయక్ మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ ఎంపీటీసీ లింగం కుప్పగండ్ల మాజీ సర్పంచ్ మొక్తాల శేఖర్ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్ టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము నాగయ్య యువ నాయకులు జంగిలి యాదగిరి జంగిలి ఆనంద్ అంజి మాస్టర్ అశోక్ కుమార్ మంగళగిరి సత్యం తదితరులు పాల్గొన్నారు

## ఎఫ్ టి ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**వెల్దండ ఆగస్టు 04:** వెల్దండ మండల కేంద్రంలో ఎఫ్ టి ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు మండల పరిషత్ కార్యాలయంలో ఎఫ్ టి ఉద్యోగులు ఉపాధి హామీ పథకం ప్రస్తుత (విబి జిరాంజీ) లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎఫ్ టి ఈ(ఫిక్సిడ్ టెన్యూర్ ఎంప్లాయ్)లకు ఇస్తామన్నా పే స్కేల్ ను కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది. దానికి అనుగుణంగానే రెండు సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 2024 నాడు ఇంద్రవెల్లి సభలో ముఖ్యమంత్రి ఆమోదం పొంది ప్రకటనకు ముందు నిలిచిపోయింది ఇప్పటివరకు అమలు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం విబిజిరాంజీ ఉద్యోగులకు ప్రకటించిన పే స్కేల్ ను తక్షణం అమలు చేసి, ఇతర సమస్యలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విబిజిరాంజీ పథకంలో పే స్కేల్ అమలయ్యే వరకు ఎలాంటి పనులు జరగకుండా షట్ డౌన్ కార్యక్రమం ఉదృతం చేస్తామని ఉద్యోగులు నల్ల బ్యాడ్జీ లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వర్ జి, ఈసీ దేవేందర్ గౌడ్, ఏసిఓలు కే రాము, ఎస్ హుస్సేన్, టిఏ లు లింగస్వామి, కృష్ణవేణి, శివలీల, సత్య నారాయణ, రేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నం భూపతిరెడ్డి



**వెల్దండ ఆగస్టు 04 :** వెల్దండ మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యులు మారేపల్లి శ్రీను తండ్రి మారేపల్లి నిరంజన్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నం భూపతిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ వార్డు నెంబర్ సభ్యులు గుద్దేటి కిష్టాల్ పాలాది మల్లీశ్వరి రంగనాథం గోసుల కొండయ్య మసిగుండ్ల వెంకటేష్ మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ క్యాసరపు వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి హమీద్ తుంగ శ్రీను మట్ట భరత్,జంగిలి ఆనందు ,గోరేటి భరత్, మట్ట విష్ణు,పుట్ట యాదయ్య, అన్నెపు వెంకటయ్య,రేవల్లి బాలరాజు మట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# సేవా స్ఫూర్తిని చాటిన పారమిత విద్యార్థులు

- **స్కూల్ చైర్మన్ జన్మదినం సందర్భంగా అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకుల అందజేత**

**కరీంనగర్, అక్షర గళం :**



పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు పుట్టినరోజు వేడుక లను పురస్కరించుకుని విద్యార్థులు సేవా స్ఫూర్తిని చాటారు. ఈ వేడుకల్లో భాగంగా పారమిత ఫిలాంత్రఫీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు, నగదు సహాయాన్ని అందజే శారు. రామడుగు మండలం వెలిచాలలో మంచికంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమానికి, జమ్మికుంటలో గోపరాజు వీరస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్పందన ఆర్గ నైజేషన్ వాలంటీర్ సంస్థకు పారమిత విద్యార్థులు నిత్యావసర సరుకులను అందిం చారు. 8 క్వింటాళ్ల బియ్యం, 17 కిలోల చింతపండు, 60 కిలోల పప్పుధాన్యాలు, 35 లీటర్ల వంట నూనె ఉన్నాయి. పాఠశాల యాజమాన్యం తరఫున రూ.50 వేల నగదు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దానగుణం, ఔదార్యం, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొం దించాలనే ఉద్దేశంతో ఫిలాంత్రఫీ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, దానధర్మాల ప్రాధాన్య తను ప్రత్యక్షంగా తెలుసుకునేలా కార్యక్ర మాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

## పెండింగ్ లో ఉన్న బకాయిలను విడుదల చేసే దాకా కాంగ్రెస్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు

- **కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు**



**అక్షర గళం, కూకట్ పల్లి :** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసే దాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు అన్నారు, తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం పిలుపు మేరకు మంగళవారం కూకట్ పల్లి అసెంబ్లీ పరిధిలోని భరతనగర్ మార్కెట్ లో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్ర మానికి భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల తెలంగాణ రాష్ట్రంలో 45 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు, ప్రస్తుతం పదివేల కోట్ల నుంచి 15 వేల కోట్ల వరకు రియంబర్స్మెంట్ పెండింగ్ లో ఉందని.. చదువులు పూర్తయిన సర్టిఫికెట్లు ఇంకా అందలేదని దుయ్యబట్టారు, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాల్సిం దేనని.. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1800 విద్యాసంస్థలకు బిజెవైయం నాయకులు నేరుగా వెళ్లి ఫీజు బకాయిలపై విద్యార్థుల సంతకాలతో పత్రాలను సేకరిం చనున్నామని, కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల ఫీజుల పట్ల చూపిస్తున్న వివక్షతను ఎండగడుతూ విద్యార్థుల పక్షాన నిలబడి మార్కెట్లో వినూత్నంగా దోశెలు అమ్మి అలా వచ్చిన డబ్బులను విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ కోసం రేవంత్ రెడ్డి సర్కార్ అందిస్తామని ఎద్దేవా చేశారు, ఇకనైనా కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పట్ల అశ్రద్ధ వీడాలని లేదంటే అన్ని నియోజక వర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యాలను ముట్టడించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా కాంతారావు రేవంత్ రెడ్డి సర్కార్ ను హెచ్చరించారు. ఈ కార్యక్రమములో నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర రావు,కార్పొరేటర్ మహేందర్,తి రుపతి, శ్రీకరరావు, విజయ్ భవాని, యాదగిరి, సతీష్,యువ మోర్చా నాయకులు తిరుపతి,శ్రీన్వాస్ చారి,సాయి, డివిజన్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# అల్లాపూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లు..







- **అధికారులను నిలదీసిన బండి రమేష్**
- **ఈ-బ్లాక్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి – సంబంధిత అధికారులకు ఆదేశం**

**కూకట్‌పల్లి, ఆగస్టు 04 :** కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్ నగర్ ప్రాంతంలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నాలుగు నెలల క్రితం ఇదే ప్రాంతంలో పాదయాత్ర చేసినప్పుడు గుర్తించిన సమస్యలే ఇప్పటికీ కొన సాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ–బ్లాక్ రోడ్డు నిర్మాణంలో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.వెంటనే కూకట్‌పల్లి జోన్ జిహెచ్ఎంసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన బండి రమేష్ , రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని కోరారు. రోడ్డు పనులకు ఇప్పటికే నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో వర్షాకాలంలో ఈ–బ్లాక్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.మంజీరా పైప్‌లైన్ పనులను సాకుగా చూపుతూ రోడ్డు పనులు నిలిపివేయడం సరికాదని, అవసరమైతే వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించి వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు.బండి రమేష్ పర్యటన సందర్భంగా స్థానిక కాలనీవాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవస రాలను బట్టి అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో అల్లాపూర్ వాజీద్ పాషా, అబ్దుల్లా, లక్ష్మణ్ గౌడ్, సాయి తులసి, రేష్మ, లక్ష్మి , రాము, రాంబాబు, శంకర్, నరసింహా, నరసింహ యాదవ్, వేణు, సతీష్‌తో పాటు స్థానిక కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# వార్డులో పౌర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**సీఎంసీ కమిషనర్ సృజనా**



**అక్షర గళం, సైబరాబాద్:** ప్రజల ఫిర్యాదుల సత్వర పరిష్కారం, వార్డులో పౌర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎంసీ కమిషనర్ సృజనా అన్నారు. వన్ డే–వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా సీఎంసీ కమిషనర్ సృజనా మంగళవారం కూకట్‌పల్లి జోన్‌లోని మూసాపేట్ సర్కిల్ పరిధిలో ఉన్న బాలానగర్ వార్డును సందర్శించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ జోనల్ కమిషనర్, మూసాపేట్ డిప్యూటీ కమిషనర్, మూసాపేట్ సర్కిల్‌కు చెందిన అన్ని విభాగాల అధిపతులు (హెచ్ఓడీలు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు కాలనీలోని రాజు కమ్యూనిటీ హాల్‌లో బాలానగర్ వార్డు ప్రజలతో కమిషనర్ ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి పౌర సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ఫిర్యాదులను తెలుసుకున్నారు.ప్రజలు తమ ప్రాంతంలోని పలు పౌర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, బాలానగర్ నాలా వెంట రిటైనింగ్ వాల్ నిర్మించి భూక్షయం నివారించి ప్రజల భద్రతను కల్పించాలని, దోమల నివారణ కోసం వార్డు అంతటా క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహిం చాలని కోరారు.అలాగే వినాయక్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ కాలనీల్లో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, సీబీఆర్ కాలనీ శ్మశానవాటికలో అవస రమైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారిని సురక్షితంగా దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, ఇంజినీరింగ్ శాఖ మ్యాన్‌హోల్ మరమ్మతుల అనంతరం రోడ్లపై మిగిలిన మట్టి, శిథిలాలను తొలగిం చాలని, తగిన వెలుతురు లేని ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కూడా కోరారు. రద్దీగా ఉండే రహదారిని దాటే సమయంలో అనేక ప్రమాదాలు జరు గుతున్నాయని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను కమిషనర్ ఓర్పుతో విని, సంబంధిత అధికారులను అన్ని అంశాలను ప్రాధాన్యతతో పరిశీలించి, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వన్ డే–వన్ వార్డ్" కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో పౌర సమస్యలను సమీక్షించడం, అన్ని శాఖల సమన్వయంతో మున్సిపల్ సేవలను వేగవంతంగా అందించడం ప్రధాన లక్ష్యంగా కొనసాగు తోందన్నారు.ఈ కార్యక్రమంలో బాలానగర్ మాజీ కార్పొరేటర్, కూకట్‌పల్లి మాజీ మున్సిపల్ చైర్మన్, ఇతర రాజకీయ నాయకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అక్రమ కట్టడాలే ముఖ్యం..అక్రమ వసూళ్లే లక్ష్యం..

- కొంపల్లి సర్కిల్ అధికారుల పర్యవేక్షణలోనే అక్రమనిర్మాణాల జోరు..?
- కొంపల్లి,దూలపల్లి లో భారీగా వెలుస్తున్న ఇల్లీగల్ షెడ్లు,అక్రమ కమర్షియల్ కట్టడాలు
- సర్కిల్ లో స్పెషల్ టాస్కోర్స్ టీంకు సహకరించని కొంపల్లి అధికారులు..?
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి..






అక్ర మని



**సిటీబ్యూరో,హైదరాబాద్ :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని కొంపల్లి సర్కిల్ లో అక్రమనిర్మాణాల జోరు కొనసాగుతోంది.సెక్షన్ టిపిబివో,ఏసిపి సారథ్యంలోనే అక్రమ వసూళ్ల దందాకు తెరలేపినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికే సదరు అధికారులు 2సర్కిళ్ల చొప్పున ఒకరే ఇంచార్జ్ గా ఉండడం,సర్కిల్ లో వెలుస్తున్న అక్రమకట్టడాలపై పిర్యాదులు రాగానే ఫీల్డ్ విజిట్ పేరుతో ఇక్కడి సిబ్బందితో వెళ్లి అక్రమనిర్మాణాదారులతో వసూళ్ల పర్వానికి తెగబడుతున్నారనే పిర్యాదులు కొకొల్లలుగా వినిపిస్తున్నాయి.అక్రమనిర్మాణాల వద్ద బలవంతపు వసూళ్లకు తెగబడుతూ,లేకపోతే బేసిబిలతో కూల్చివేస్తామంటూ హెచ్చరిస్తున్నారని సదరు నిర్మాణాదారులు వాపోతున్నారు.ఈ వ్యవహారాలపై సర్కిల్ డీసీ శ్రద్దపెట్టి అవినీతిని అరికట్టి అక్రమకట్టడాలపై ఉక్కుపాదం మోపి, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ లోనే కొంపల్లి సర్కిల్ ను ఉత్తమసర్కిల్ గా తీర్చిదిద్దాలన్న డిమాండ్ లు వినిపిస్తున్నాయి..

**ఇల్లీగల్ షెడ్లు,అక్రమ భవంతులే సర్కిల్ అధికారులకు ఆదాయవనరులు..**

కొంపల్లి సర్కిల్ పూర్తిగా అక్రమకట్టడాలతో విరజిల్లుతుంది..దూలపల్లి చైనామార్కెట్,అపురూపకాలనీ సుభాష్ నగర్ లలో వెలిసే అక్రమనిర్మాణాలే టార్గెట్ గా అధికారులు వ్యవహరిస్తున్నారు.అక్రమకట్టడాల్లో తమ చేతివాటం ప్రదర్శిస్తూ తమ మాటవినని అక్రమనిర్మాణాదారులపైనే కూల్చివేతలు చేస్తున్నారు. కొంపల్లి జయభేరి కాలనీ రోడ్ లో వెలిసే అక్రమ కమర్షియల్ కట్టడం మొదలు,దులపల్లిలో వెలుస్తున్న ఇల్లీగల్ భారీషెడ్, సుభాష్ నగర్ లో రోడ్ ఎంక్రోచ్మెంట్ తో నిర్మించే అదనపు అంతస్తుల భవనం, అపురూప కాలనీలో వెలిసే అక్రమకట్టడాలపై చర్యలకు వెనకాడడం వీరి నిబద్ధతకు నిదర్శనంగా చెప్పవచ్చు.కొంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అదికారులు,సిబ్బంది వ్యవహారం సర్కిల్ కు మాయని మచ్చగా మారింది.ఇప్పటికైన సర్కిల్ డీసీ ఇక్కడ వెలిసిన అక్రమకట్టడాల వ్యవహారంపై,తమ సర్కిల్ అధికారుల తీరుపై దృష్టిసారించి అక్రమనిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని సర్కిల్ ప్రజలు సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు..

**సర్కిల్ లో కానరాని స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం..**

సైబరాబాద్ కార్పోరేషన్ పరిదిలోని అన్ని సర్కిల్ కార్యాలయాల్లో అక్రమకట్టడాలపై వస్తున్న వరుస ఫిర్యాదులపై స్పెషల్ టాస్కోర్స్ టీంలు ఏర్పాటు చేసి అక్రమకట్టడాల నిర్మూళనకు అడుగులు వేస్తునే ప్రభుత్వ కజాన నింపే దిశగా చర్యలకు శ్రీకారం చుట్టింది సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్..కానీ స్పెషల్ టాస్కోర్స్ టీంలకు సర్కిల్ వ్యాప్తంగా వెలిసే అక్రమకట్టడాల లీస్ట్ లను అందించకుండా టౌన్ ప్లానింగ్ అధికారుల మాటవినని కట్టడాలను మాత్రమే టార్గెట్ చేస్తూ,భారీ ఇల్లీగల్ షెడ్లు,రెసిడెన్షియల్ పర్మిషన్ లతో వెలిసే భారీ కమర్షియల్ భవంతులను పట్టించుకోకపోవడంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీంలపై సైతం సర్కిల్ లో బిన్నరీతీలో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి.. సర్కిల్ డీసితో పాటు జోనల్ సిటీప్లానర్ లు కొంపల్లి పై ప్రత్యేకదృష్టి పెట్టి అక్రమకట్టడాలపై ఉక్కుపాదం మోపి,ఇక్కడి అధికారులపై సైతం చర్యలకు పూనుకోవాలని సర్వత్రా డిమాండ్ లు వినిపిస్తున్నాయి..

# మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- ఫిర్యాదులపై సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి
- విజిబుల్ పోలీసింగ్ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4:**

జగిత్యాల జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు.

**ఈ సందర్భంగా ఎస్పి అశోక్ కుమార్**




మాట్లాడుతూ

ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. నేరాలను ముందుగానే అరికట్టే విధంగా ఇంటెలిజెన్స్ సేకరణ, బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, అనుమానిత వ్యక్తులపై నిఘా, సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, జైలు నుంచి విడుదలైన నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్లపై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఎస్పి వెంట డిఎస్పి రాములు, ఎస్ఐలు కిరణ్ కుమార్, రాజు నాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# స్వచ్ఛ విద్యాలయ పురస్కారం ఉపాధ్యాయుల అంకితభావానికి పట్టం

- పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి

**నంగునూరు, ఆగస్టు 04 :**

నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ విద్యాలయ పురస్కారం కోసం ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయ మని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా నంగునూరు ఉన్నత పాఠశాలను సందర్శించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ఈ అరుదైన గౌరవం పాఠశాలకు దక్కిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని అన్నారు. విద్యతో పాటు పరిశుభ్రత, క్రమశిక్షణ, విలువల బోధనకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే నంగునూరు పాఠశాలకు ఈ గౌరవం దక్కిందని పేర్కొన్నారు. ఈ పురస్కారం జిల్లాలోని ఇతర పాఠశాలలకు సైతం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ మాట్లాడుతూ ఈ అవార్డు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు అందరి సమిష్టి కృషికి దక్కిన గుర్తింపని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యా ప్రమాణాలతో పాటు పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో



ఉపాధ్యాయులు, పీఆర్టీయూ టీఎస్ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొని ప్రధానోపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ పురస్కారం నంగునూరు మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని వారు హర్షం వ్యక్తం చేశారు. పీఆర్టీయూ నంగునూరు శాఖ అధ్యక్షులు ఎర్ర పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎర్ర పార్థసారధి, రామస్వామి, ఒగులం రాజిరెడ్డి, భూపతి రెడ్డి, నరేశ్, కొత్తపల్లి రవి, జైపాల్ యాదవ్, సింగాబట్టు, రామరాజు, కోరే రాములు, మహేందర్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలి

## ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన ఆకుల సతీష్





**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** సర్వే నంబర్ 472లో హౌసింగ్ బోర్డు కోసం కేటాయించిన సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసి వెంచర్‌గా అభివృద్ధి చేస్తున్న విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని బిజెపి నేత ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించేందుకు మంగళవారం దుండిగల్ ఎంఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే భూమిపై 2024లో కూడా అక్రమ కబ్జాల ప్రయత్నాలు జరగగా అధికారులు వాటిని కూల్చివేశారని ఆయన గుర్తు చేశారు. అయితే ఇటీవల హౌసింగ్ బోర్డుకు కేటాయించిన ఈ ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయకపోవడంతో కబ్జాదారులు మళ్లీ రెచ్చిపోయి వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అక్రమ కబ్జాదారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని ఎంఆర్‌ఓను కోరినట్లు తెలిపారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే దుండిగల్ ఎంఆర్‌ఓ రాజేశ్వర్ రెడ్డి స్పందించి, ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన మూడు బేస్‌మెంట్‌లను తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే త్వరలో హౌసింగ్ బోర్డు అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో రక్షిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించిన దుండిగల్ ఎంఆర్‌ఓ రాజేశ్వర్ రెడ్డికి ఆకుల సతీష్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమము

- విద్యార్థులకు పొట్ట నరేందర్ యాదవ్ బ్యాగుల పంపిణీ-
- బీ ఆర్ ఎస్ నాయకులు పొట్ట నరేందర్ యాదవ్-



**శేరిలింగంపల్లి,ఆగష్టు 04 :** శేరిలింగంపల్లి గోపినగర్ ప్రభుత్వ పాఠశాలలో 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి దేశ పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువులు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నామని విద్యార్థులు ఆత్మన్యూనతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. భవిష్యత్‌లో కలెక్టర్లు, పోలీసు అధికారులు, వైద్యులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతోపాటు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కే.ఎన్. రాములు, శంకర్ వాకిటి, నరసింహారెడ్డి, జంగయ్య, రియాజ్, నిరూప, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు పౌష్టిక ఆహారం

## ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వప్న

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 04 :**

తల్లిపాలే పిల్లలకు పౌష్టికాహారమని ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వప్న సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని వడ్డెర కాలనీ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలని సూచించారు. ముర్రుపాలతో బిడ్డలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భవతులు పొందాలని తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్వాడి కేంద్రంలో చేర్చాలని దానివల్ల పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందుతుందని అన్నారు. వయసుకు సరిపడా ఎత్తు, బరువు కలిగి ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వినోద, గర్భవతులు భాలింతలు పాల్గొన్నారు.

చురకలు



# ఉమ్మడి వరంగల్ వైద్యరంగానికి భారీ ఊతం..

- కీలక ప్రాజెక్టులపై మంత్రి 'దామోదర' సమీక్ష
- అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం...ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఆసుపత్రుల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

**జనగామ/స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 4 : :**

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేపడుతున్న వైద్య ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. సమావేశంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి, స్టేషన్ ఘనపూర్ 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల కల్పన, వైద్య సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి, నూతన సంవత్సరంలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.అలాగే ఆసుపత్రి



ప్రారంభం నాటికే అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల, చిల్పూర్ మండల కేంద్రం, రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామాల హెల్త్ సబ్ సెంటర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. స్టేషన్ ఘనపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సేవలను తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, వైద్య ఆరోగ్య శాఖ

# ఎన్‌హెచ్-163లో మిగిలిన సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ కు వినతిపత్రం
- రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక చర్యలు...గ్రామాల అనుసంధానానికి ప్రాధాన్యం

**వరంగల్, ఆగస్టు 4 ::**

యాదాద్రి–వరంగల్ మధ్య జాతీయ రహదారి–163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి సమస్య తీవ్రతను వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్–163)లో యాదాద్రి–వరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల



సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య కీలక అనుసంధాన లింకులు ఇప్పటికీ పూర్తికాలేదని తెలిపారు.జనగాం సమీపంలోని 87/200 కిలోమీటర్ ప్రాంతం నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి, అక్కడి నుంచి చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం వరకు పలు ప్రాంతాల్లో సర్వీస్ రోడ్ల మధ్య లింకులు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.దీంతో స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడి, ట్రాఫిక్ రద్దీతో పాటు రోడ్డు ప్రమాదాల ప్రమాదం కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే సర్వీస్ రోడ్లకు అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన లింకుల నిర్మాణాన్ని వెంటనే చేపట్టడంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని పేర్కొన్నారు.ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌలభ్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానాన్ని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ను ఎంపీ డా. కడియం కావ్య కోరారు.ఈ వినతిపై ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో

# సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ అవగాహన కార్యక్రమాలు

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.**

**వికారాబాద్, ఆగస్ట్,04:**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే Cyber Jaagrookta Diwas కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మార్కెట్ ప్రాంతాలు, అలాగే ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ఇతర ప్రదేశాల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు ఈ క్రింది సూచనలు చేశారు:**

★ తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, OTPలు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు.

★ సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రకటనలు, పెట్టుబడి ఆఫర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

★ అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, అధికారిక వెబ్‌సైట్లు మరియు యాప్‌లను మాత్రమే వినియోగించాలి.

★ సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయడం వల్ల త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడంతో




పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS విజ్ఞప్తి చేశారు.

# వరంగల్‌ను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం..

- మంత్రులు దామోదర, కొండా సురేఖ
- సూపర్ స్పెషాలిటీ నుంచి గ్రీన్ హాస్పిటల్స్ వరకు... వరంగల్ వైద్యరంగంలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం

**వరంగల్, ఆగస్టు 4 ::**

ఉమ్మడి వరంగల్ జిల్లాను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, ఇతర వైద్య సంస్థల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, మౌలిక వసతుల బలోపేతంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆయన కార్యాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు.సమావేశంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంజీఎం, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద టీచింగ్ హాస్పిటల్, నర్సంపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కాకతీయ మెడికల్ కాలేజీతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధి, మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, ఆధునిక వైద్య పరికరాల సమీకరణ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల కల్పనపై విస్తృతంగా చర్చించారు.సూపర్



స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర విభాగం, డయాలసిస్, క్యాథ్‌ల్యాబ్, ఆక్సిజన్ సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటుతో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి నిర్ణీత గడువులోగా ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. దీంతో ఎంజీఎం ఆసుపత్రిపై ఉన్న ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి చేసిన ప్రతిపాదనలను పరిశీలించి, ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఎంజీఎం ఆసుపత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పాత భవనాల మరమ్మతులు, విద్యుత్, ప్లంబింగ్, భద్రతా వ్యవస్థల బలోపేతంతో పాటు ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అలాగే ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఖాళీల భర్తీ, ఆధునిక నేత్ర వైద్య పరికరాల సమీకరణ, కాకతీయ మెడికల్ కాలేజీలో పెరిగిన ఎంబీబీఎస్, పీజీ సీట్లకు అనుగుణంగా హాస్టళ్లు, అకాడమిక్ భవనాలు, ఆడిటోరియం నిర్మాణం, అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టాలని కోరారు.నర్సంపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, టీచింగ్ హాస్పిటల్, జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో మౌలిక వసతుల కల్పన, నిధుల కేటాయింపు, సిబ్బంది కొరత నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో అన్ని వైద్య సంస్థల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని (స్పెషల్ ఆఫీసర్) నియమించాలని మంత్రి దామోదర రాజనర్సింహను మంత్రి కొండా సురేఖ కోరారు.అదేవిధంగా 'గ్రీన్ హాస్పిటల్స్' లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను అమలు చేయాలని, సీకేఎం ఆసుపత్రిలో పేరుకుపోయిన స్క్రాప్‌ను తొలగించి ఆ స్థలాన్ని ఆసుపత్రి అవసరాలకు వినియోగించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి ప్రజలకు విశ్వసనీయ ఆరోగ్య కేంద్రంగా మారాలని, నాణ్యమైన ఉచిత వైద్య సేవలందించడంలో ఎలాంటి లోటు ఉండకూడదని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వైద్యరంగ అభివృద్ధిని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

# భూముల రీ-సర్వే వేగవంతం చేయాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి**



**హనుమకొండ, ఆగస్టు 4 :**

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ–సర్వే పనులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మంగళవారం పరిశీలించారు. రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, సర్వే షెడ్యూల్‌ను ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 75 ఎకరాల భూమిని సర్వే చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. రైతులకు తేదీలు, సమయాలపై ముందస్తు సమాచారం అందించి, పారదర్శకంగా, నాణ్యతతో రీ–సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో రెండు సర్వే బృందాలు పనిచేస్తున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, తహసీల్దార్ విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆప్ వ్యవస్థ ద్వారానే ఎరువుల విక్రయాలు

**వ్యవసాయ అధికారి అరుణ (తాండూరు డివిజన్)**

**తాండూరు,ఆగస్ట్,04:**



వికారాబాద్ జిల్లా తాండూరు: భారత ప్రభుత్వ రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాల కోసం నూతన యాప్ వ్యవస్థ ఏర్పాటు చేసిందని, ఆ ఆప్ ద్వారానే విక్రయాలు జరుగుతాయని తాండూరు డివిజన్ వ్యవసాయ అధికారి అరుణ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ....ఇప్పటివరకు ఉన్న ఎరువుల విక్రయాలు నేటితో నిలిపివేయబడతాయన్నారు. రేపటినుండి అప్ గ్రేట్ చేయబడిన కొత్త ఆప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరగనున్నాయన్నారు. ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారానే రైతులు తమ ఆధార్ ఆధారిత ధ్రువీకరణతో సులభంగా ఎరువులను పొందాలన్నారు. సంబంధిత ఎరువుల డీలర్లు దుకాణం వద్ద రైతులకు ఎఫ్ ఎఫ్ ఎస్ వినియోగంపై సహాయం అందించేందుకు స్వచ్ఛంద సేవకులను అందుబాటులో ఉంచాలన్నారు. స్వచ్ఛంద సేవకులు బుకింగ్ ప్రక్రియ ధ్రువీకరణ మరియు ఎరువుల కొలుగోలు ప్రక్రియలో రైతులకు సహకారం అందిస్తారన్నారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు.

# మండలాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనల నివేదికలను వెంటనే సమర్పించాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక.**




**నారాయణపేట, ఆగస్టు,04:**

మండలాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించిన ప్రత్యేక అధికారులు, మండల ఇన్‌చార్జ్ అధికారులు తమ పర్యటనల నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా అధికారుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నియమించిన ప్రత్యేక అధికారులు తాము సందర్శించిన మండలాల్లో ఉన్న మౌలిక వసతుల లోపాలు, ప్రజలకు అందుతున్న సేవల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధికి అవసరమైన చర్యలు, సేవల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన అభిప్రాయాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తదుపరి సమీక్ష సమావేశంలో ప్రతి ప్రత్యేక అధికారిని వారి పరిశీలనలపై అభిప్రాయాలు అడుగుతామని, అందుకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల అధికారులు, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పాఠశాల భవనాల పరిస్థితి, పైకప్పుల లీకేజీలు, విద్యార్థుల భద్రత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రధాన సమస్యలను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, వెంటనే జిల్లా పరిపాలనకు తెలియజేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు తమ బాధ్యతలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా జిల్లాలోని మద్దూరు, గుండుమల్, కొత్తపల్లి, కోస్గి మండలాలలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు.అంతకు ముందు సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తమ తమ శాఖలకు మంజూరైన నిధులు, ప్రగతి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీ ఆర్ వో రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చురకలు బుధవారం 05.08.2026

## సురక్ష కా తిరంగా పోస్టర్ ఆవిష్కరణ..

### నెల పొడవునా సైబర్ అవగాహన కార్యక్రమాలు




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 4 ::**

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు నెల పొడవునా జిల్లాలో సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. స్టాక్, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాల వంటి సైబర్ ఆర్థిక నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ఆగు–ఆలోచించు–నిజం నిర్ధారించు–సైబర్ భద్రత పెంచు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 5 నుంచి పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పరిశ్రమలు, మహిళా సంఘాలు తదితర సంస్థల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్బీ–2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్ఐ జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యతను పెంచుతుంది

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఆగస్ట్,04:**

నారాయణపేట: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి పదోన్నతి పొందిన పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత అంకితభావంతో సేవలు అందించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS సూచించారు.జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ (AR) విభాగంలో పదోన్నతి పొందిన ఎస్. రామచంద్రయ్య మరియు ఎం. దశరథం హెడ్ కానిస్టేబుళ్లు మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ పదోన్నతి పొందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు స్వయంగా పట్టీలు (ర్యాంక్ బ్యాడ్జీలు) అలంకరించి అభినందనలు తెలిపారు. పదోన్నతి అనేది ఉద్యోగ జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని, అది కేవలం హోదా పెరగడమే కాకుండా మరింత బాధ్యతను, కర్తవ్యనిష్ఠను కూడా పెంచుతుందని పేర్కొన్నారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు RI విజయ్ భాస్కర్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు అభినందనలు తెలియజేశారు.

## అంగన్ వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.



**వలిగొండ ఆగస్టు 05 (సమయం న్యూస్ )**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం చిత్తాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం రోజు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడీ టీచర్ గుంటోజు మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని అన్నారు. ఇవి శిశువుకు రోగనిరోధక శక్తిని అందిస్తాయని తెలిపారు. మొదటి ఆరు నెలల వరకు పసిబిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, కనీసం రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలు శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లమల్ల మానస రాములు, ప్రధానోపాధ్యాయుడు పసల విజయానంద్ ,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అంగన్‌వాడీ టీచర్ మనెమ్మ , ఆయా ఆరూరి నరసమ్మ తల్లులు,గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 వరకు ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ నామినేషన్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 :):**

మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్–2026 కోసం నామినేషన్ల గడువును ఆగస్టు 15 వరకు పొడిగించింది. సాహసం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు–సంస్కృతి, విజ్ఞాన–సాంకేతిక రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్లలోపు భారతీయ పిల్లలు అర్హులు. గరిష్ఠంగా 25 మందికి పతకం, ప్రశంసాపత్రం, సిటేషన్ అందజేయనున్నారు. నామినేషన్లు ఆన్‌లైన్‌లో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు.

# ఏటీసీలతో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**రుద్రంగి, ఆగస్టు 4 :):**



అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి దేశీయ, విదేశీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో రూ.45 కోట్లతో నిర్మించనున్న ఏటీసీ కేంద్రానికి, రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.4,000 కోట్లతో 65 ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామని, ఐటీఐలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందిస్తున్నట్లు చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగాల కోసం విదేశీ భాషల శిక్షణతో పాటు డ్రోన్, ఏఐ వంటి ఆధునిక కోర్సులను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి ఏటీసీలో 288 మంది విద్యార్థులకు ఏడు కోర్సుల్లో శిక్షణ అందుతుందని తెలిపారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం జరుగుతోందని, రోడ్లు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు వేగంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఏటీసీల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏఐ, డ్రోన్ టెక్నాలజీ తదితర ఆధునిక కోర్సులు అందుబాటులో ఉంటాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధి కల్పన & శిక్షణ

# భద్రాచలం ఆలయ పునర్నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలి

### కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 4 ::**

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆలయంలో కొనసాగుతున్న పనులను పరిశీలించిన ఆయన, ఉత్తర ద్వార దర్శనం నిర్మాణాన్ని ముక్కోటి ఏకాదశి నాటికి పూర్తి చేయాలని సూచించారు.ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా నిర్మాణాలు చేపట్టాలని, గోదావరి ఘాట్ వరకు రోడ్డు విస్తరణ, పాదచారుల మార్గాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రత వంటి మౌలిక వసతులను పుష్కరాల నాటికి సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. చిత్రకూట మండపంలోని పురాతన రాతి స్తంభాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరుస్తూ తొలగింపు పనులు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం గోదావరి పుష్కరాలకు ముందే అన్ని ప్రధాన పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా



పెట్టుకుందని, పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని

# 2019–2026 మధ్య 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చాం

### కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 ::**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2019 నుంచి 2026 (జూలై వరకు) మధ్య 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు తిరిగి తీసుకొచ్చినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది.కేంద్ర ప్రభుత్వం పరారీలో ఉన్న నేరస్థుల అప్పగింపును జాతీయ ప్రాధాన్యంగా తీసుకుని, చట్టపరమైన సంస్కరణలు, అంతర్జాతీయ సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపింది. 2018లో ఫ్యూజిటివ్ ఎకనామిక్ ఆఫెండర్స్ చట్టం, 2019లో ఎన్ఐఏ, యూఏపీఏ సవరణలు, 2024లో అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల్లో గైర్హాజరులోనే విచారణ (Trial in Absentia) వంటి నిబంధనలు తీసుకువచ్చినట్లు పేర్కొంది.2025లో ప్రారంభించిన భారత్‌పోల్ (BHARATPOL) ద్వారా 1,400కు పైగా కేంద్ర, రాష్ట్ర సంస్థలను ఇంటర్‌పోల్‌తో అనుసంధానించి సమాచార మార్పిడిని వేగవంతం చేసినట్లు తెలిపింది. గత మూడు సంవత్సరాల్లో 401 ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించింది.ఆపరేషన్ త్రిశూల్ కింద ఉపగ్రహ సాంకేతికత, డిజిటల్ ఫుట్‌ప్రింట్లు, ఇంటర్‌పోల్ సహకారంతో విదేశాల్లో పేర్లు మార్చుకుని దాక్కున్న నేరస్థులను గుర్తించి పట్టుకున్నట్లు హోంశాఖ పేర్కొంది.2019–2026 మధ్య పీఎంఎల్ఏ అమలుతో పరారీలో ఉన్న నేరస్థుల ₹17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయగా, ₹18,762 కోట్ల నిధులను తిరిగి స్వాధీనం చేసినట్లు వెల్లడించింది.తిరిగి తీసుకొచ్చిన వారిలో ఉగ్రవాదం, ఆర్థిక నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ

# వరంగల్‌కు రూ.15 వేల కోట్లకుపైగా అభివృద్ధి ప్రాజెక్టులు...

- కేంద్రం కీలక ప్రకటన
- వరంగల్ అభివృద్ధిపై లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య గళం
- రైల్వేలు, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్ పార్క్‌తో వరంగల్‌కు అభివృద్ధి ఊపు
- వరంగల్ రూపురేఖలు మార్చనున్న మెగా ప్రాజెక్టులు

**వరంగల్, ఆగస్టు 4 : :**

వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్, ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్‌కు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉందా? ఉంటే ఏయే ప్రాజెక్టులు మంజూరయ్యాయి? వాటి ద్వారా జిల్లాకు కలిగే ప్రయోజనాలపై వివరాలు వెల్లడించాలని కోరారు.ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. అందులో వరంగల్ జిల్లాలో కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు ₹7,843 కోట్ల వ్యయంతో 447 కిలోమీటర్ల మేర మూడు రైల్వే ప్రాజెక్టులు, ₹6,133 కోట్ల వ్యయంతో 185 కిలోమీటర్ల మేర నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులు ఆమోదం పొందినట్లు తెలిపింది.అలాగే పీఎం మిత్ర (PM MITRA) పథకం కింద 1,327 ఎకరాల్లో బ్రౌన్‌ఫీల్డ్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు సుమారు ₹1,696 కోట్ల వ్యయం కేటాయించినట్లు కేంద్రం వెల్లడించింది.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, అమలులో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టత కోరినట్లు తెలిపారు.



రైల్వే, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో పారిశ్రామిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు.అలాగే వరంగల్‌కు మంజూరైన ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తానని చెప్పారు. ప్రకటించిన అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా, వాటిని వేగంగా అమలు

# పరిశుభ్రతే ప్రజారోగ్యానికి తొలి మెట్టు.. స్మశానవాటికలో పారిశుధ్య పనులు...

- టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్
- స్మశానవాటికలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి
- వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు





**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 4 ::**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఉన్న స్మశానవాటికలో చేపడుతున్న పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా స్మశానవాటికలో పేరుకుపోయిన చెట్లు, పొదలు, చెత్తాచెదారాన్ని పరిశీలించి, వాటిని డోజర్ సహాయంతో తొలగించే పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ సందర్భంగా పెండెం రామానంద్ మాట్లాడుతూ, స్మశానవాటికలు ప్రజలకు అత్యంత అవసరమైన సామాజిక మౌలిక వసతులలో ఒకటని, వాటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, అందుబాటులో ఉంచడం స్థానిక సంస్థల బాధ్యత అని అన్నారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పారిశుద్ధ్య పనులు వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, పట్టణంలోని ప్రతి ప్రాంతంలో అవసరమైన పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ సలావుద్దీన్ అయూబ్ ఖాన్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, వార్డు జవాన్ మాదాసి భరత్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ వైద్యరంగానికి భారీ ఊతం..

- కీలక ప్రాజెక్టులపై మంత్రి 'దామోదర' సమీక్ష
- అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం...ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఆసుపత్రుల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

**జనగామ/స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 4 : :**

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేపడుతున్న వైద్య ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. సమావేశంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి, స్టేషన్ ఘనపూర్ 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల కల్పన, వైద్య సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి, నూతన సంవత్సరంలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.అలాగే ఆసుపత్రి



ప్రారంభం నాటికే అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల, చిల్పూర్ మండల కేంద్రం, రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామాల హెల్త్ సబ్ సెంటర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. స్టేషన్ ఘనపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సేవలను తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, వైద్య ఆరోగ్య శాఖ

# ఎన్‌హెచ్-163లో మిగిలిన సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ కు వినతిపత్రం
- రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక చర్యలు...గ్రామాల అనుసంధానానికి ప్రాధాన్యం

**వరంగల్, ఆగస్టు 4 ::**

యాదాద్రి–వరంగల్ మధ్య జాతీయ రహదారి–163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి సమస్య తీవ్రతను వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్–163)లో యాదాద్రి–వరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల



సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య కీలక అనుసంధాన లింకులు ఇప్పటికీ పూర్తికాలేదని తెలిపారు.జనగాం సమీపంలోని 87/200 కిలోమీటర్ ప్రాంతం నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి, అక్కడి నుంచి చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం వరకు పలు ప్రాంతాల్లో సర్వీస్ రోడ్ల మధ్య లింకులు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.దీంతో స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడి, ట్రాఫిక్ రద్దీతో పాటు రోడ్డు ప్రమాదాల ప్రమాదం కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే సర్వీస్ రోడ్లకు అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన లింకుల నిర్మాణాన్ని వెంటనే చేపట్టడంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని పేర్కొన్నారు.ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌలభ్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానాన్ని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను ఎంపీ డా. కడియం కావ్య కోరారు.ఈ వినతిపై ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో

# సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ అవగాహన కార్యక్రమాలు

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.**

**వికారాబాద్, ఆగస్ట్,04:**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే Cyber Jaagrookta Diwas కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మార్కెట్ ప్రాంతాలు, అలాగే ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ఇతర ప్రదేశాల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు ఈ క్రింది సూచనలు చేశారు:**

★ తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, OTPలు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు.

★ సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రకటనలు, పెట్టుబడి ఆఫర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

★ అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, అధికారిక వెబ్‌సైట్లు మరియు యాప్‌లను మాత్రమే వినియోగించాలి.

★ సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయడం వల్ల త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడంతో




పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS విజ్ఞప్తి చేశారు.

# వరంగల్‌ను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం..

- మంత్రులు దామోదర, కొండా సురేఖ
- సూపర్ స్పెషాలిటీ నుంచి గ్రీన్ హాస్పిటల్స్ వరకు... వరంగల్ వైద్యరంగంలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం

**వరంగల్, ఆగస్టు 4 ::**

ఉమ్మడి వరంగల్ జిల్లాను తెలంగాణలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, ఇతర వైద్య సంస్థల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, మౌలిక వసతుల బలోపేతంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి ఆయన కార్యాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు.సమావేశంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంజీఎం, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద టీచింగ్ హాస్పిటల్, నర్సంపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కాకతీయ మెడికల్ కాలేజీతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధి, మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, ఆధునిక వైద్య పరికరాల సమీకరణ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల కల్పనపై విస్తృతంగా చర్చించారు.సూపర్



స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర విభాగం, డయాలసిస్, క్యాథ్‌ల్యాబ్, ఆక్సిజన్ సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటుతో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి నిర్ణీత గడువులోగా ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. దీంతో ఎంజీఎం ఆసుపత్రిపై ఉన్న ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి చేసిన ప్రతిపాదనలను పరిశీలించి, ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఎంజీఎం ఆసుపత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పాత భవనాల మరమ్మతులు, విద్యుత్, ప్లంబింగ్, భద్రతా వ్యవస్థల బలోపేతంతో పాటు ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అలాగే ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఖాళీల భర్తీ, ఆధునిక నేత్ర వైద్య పరికరాల సమీకరణ, కాకతీయ మెడికల్ కాలేజీలో పెరిగిన ఎంబీబీఎస్, పీజీ సీట్లకు అనుగుణంగా హాస్టళ్లు, అకాడమిక్ భవనాలు, ఆడిటోరియం నిర్మాణం, అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టాలని కోరారు.నర్సంపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, టీచింగ్ హాస్పిటల్, జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో మౌలిక వసతుల కల్పన, నిధుల కేటాయింపు, సిబ్బంది కొరత నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో అన్ని వైద్య సంస్థల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని (స్పెషల్ ఆఫీసర్) నియమించాలని మంత్రి దామోదర రాజనర్సింహను మంత్రి కొండా సురేఖ కోరారు.అదేవిధంగా 'గ్రీన్ హాస్పిటల్స్' లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను అమలు చేయాలని, సీకేఎం ఆసుపత్రిలో పేరుకుపోయిన స్క్రాప్‌ను తొలగించి ఆ స్థలాన్ని ఆసుపత్రి అవసరాలకు వినియోగించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి ప్రజలకు విశ్వసనీయ ఆరోగ్య కేంద్రంగా మారాలని, నాణ్యమైన ఉచిత వైద్య సేవలందించడంలో ఎలాంటి లోటు ఉండకూడదని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వైద్యరంగ అభివృద్ధిని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

# భూముల రీ-సర్వే వేగవంతం చేయాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి**



**హనుమకొండ, ఆగస్టు 4 :**

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ–సర్వే పనులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మంగళవారం పరిశీలించారు. రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, సర్వే షెడ్యూల్‌ను ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 75 ఎకరాల భూమిని సర్వే చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. రైతులకు తేదీలు, సమయాలపై ముందస్తు సమాచారం అందించి, పారదర్శకంగా, నాణ్యతతో రీ–సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో రెండు సర్వే బృందాలు పనిచేస్తున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, తహసీల్దార్ విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆప్ వ్యవస్థ ద్వారానే ఎరువుల విక్రయాలు

**వ్యవసాయ అధికారి అరుణ (తాండూరు డివిజన్)**

**తాండూరు,ఆగస్ట్,04:**



వికారాబాద్ జిల్లా తాండూరు: భారత ప్రభుత్వ రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాల కోసం నూతన యాప్ వ్యవస్థ ఏర్పాటు చేసిందని, ఆ ఆప్ ద్వారానే విక్రయాలు జరుగుతాయని తాండూరు డివిజన్ వ్యవసాయ అధికారి అరుణ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ....ఇప్పటివరకు ఉన్న ఎరువుల విక్రయాలు నేటితో నిలిపివేయబడతాయన్నారు. రేపటినుండి అప్ గ్రేట్ చేయబడిన కొత్త ఆప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరగనున్నాయన్నారు. ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారానే రైతులు తమ ఆధార్ ఆధారిత ధ్రువీకరణతో సులభంగా ఎరువులను పొందాలన్నారు. సంబంధిత ఎరువుల డీలర్లు దుకాణం వద్ద రైతులకు ఎఫ్ ఎఫ్ ఎస్ వినియోగంపై సహాయం అందించేందుకు స్వచ్ఛంద సేవకులను అందుబాటులో ఉంచాలన్నారు. స్వచ్ఛంద సేవకులు బుకింగ్ ప్రక్రియ ధ్రువీకరణ మరియు ఎరువుల కొలుగోలు ప్రక్రియలో రైతులకు సహకారం అందిస్తారన్నారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు.

# మండలాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనల నివేదికలను వెంటనే సమర్పించాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక.**




**నారాయణపేట, ఆగస్టు,04:**

మండలాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించిన ప్రత్యేక అధికారులు, మండల ఇన్‌చార్జ్ అధికారులు తమ పర్యటనల నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా అధికారుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నియమించిన ప్రత్యేక అధికారులు తాము సందర్శించిన మండలాల్లో ఉన్న మౌలిక వసతుల లోపాలు, ప్రజలకు అందుతున్న సేవల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధికి అవసరమైన చర్యలు, సేవల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన అభిప్రాయాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తదుపరి సమీక్ష సమావేశంలో ప్రతి ప్రత్యేక అధికారిని వారి పరిశీలనలపై అభిప్రాయాలు అడుగుతామని, అందుకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల అధికారులు, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించే సమయంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పాఠశాల భవనాల పరిస్థితి, పైకప్పుల లీకేజీలు, విద్యార్థుల భద్రత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రధాన సమస్యలను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, వెంటనే జిల్లా పరిపాలనకు తెలియజేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు తమ బాధ్యతలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా జిల్లాలోని మద్దూరు, గుండుమల్, కొత్తపల్లి, కోస్గి మండలాలలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు.అంతకు ముందు సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తమ తమ శాఖలకు మంజూరైన నిధులు, ప్రగతి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీ ఆర్ వో రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చురకలు



# ఘనంగా బోనాల ఉత్సవాలు

## అంగరంగ వైభవంగా సాగిన బోనాల జాతర



**యాలాల మండలం, ఆగస్టు,04:**

జుంటుపల్లి గ్రామంలో బోనాల ఉత్సవాలు మంగళవారం సర్పంచ్ వాణిశ్రీ రమేష్ గౌడ్, రవీందర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ అనగానే ఆధ్యాత్మికంగా మొదటగా గుర్తొచ్చేది బతుకమ్మ, తర్వాత బోనాలు పండుగ అని అన్నారు. శక్తికి ప్రతీక అయిన అమ్మవార్లను భక్తితో కొలుస్తూ, సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు నిలుస్తాయన్నారు ఈ పండుగలు. ఇప్పుడు ఆషాఢ మాసంలో తొలి బోనాల వేడుకలు సైతం మొదలై రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. మరి, వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ బోనాలకు చాలా ప్రత్యేకత ఉందన్నారు. ఆషాఢం ప్రారంభం నుంచి శ్రావణ మాసం పూర్తయ్యే వరకు దశలవారీగా తెలంగాణ వ్యాప్తంగా గ్రామ దేవతలకు, అమ్మవార్లు బోనాలు సమర్పిస్తారన్నారు. చీరాసారెతో ఇంటి ఆడపడుచుగా గౌరవాన్ని ఇస్తారన్నారు.సుఖశాంతుల్లో, కష్ట కాలంలో తోడుండమని మొక్కుతూ మొక్కులు చెల్లించుకుంటారన్నారు. జుంటుపల్లి గ్రామంలో బోనాల వేడుక కన్నులపండువగా జరిగిందన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత కత్తి వెంకటస్వామి గౌడ్ కు మోకుదెబ్బ నాయకుల పరామర్శ



**హన్మకొండ, ఆగస్టు 4 ::**

కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జాతీయ కో–ఆర్డినేటర్, సీనియర్ నాయకులు ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి గౌడ్ సతీమణి భవాని గౌడ్ ఇటీవల అకాల మరణం చెందారు. కాగా మంగళవారం మోకుదెబ్బ జాతీయ, రాష్ట్ర నాయకులు హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో ఉన్న వారి నివాసానికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా భవాని గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు, అనంతరం ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి గౌడ్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, టీజీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు కేసరి ఆంజనేయులు గౌడ్, ఆనంతుల రమేష్ గౌడ్, జాతీయ నాయకుడు కదిరే ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (DCRB)ను ఆకస్మికంగా పరిశీలించిన

## జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS



**వికారాబాద్, ఆగస్టు,04:**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS నేడు జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (DCRB) కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేసుల రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల వివరాలు, నేర గణాంకాల నిర్వహణ, ★CCTNS★లో కేసుల నమోదు విధానం, రికార్డుల భద్రపరిచే విధానం, డిజిటల్ డేటా భద్రత, కార్యాలయ పరిపాలనతో పాటు ఇతర సంబంధిత అంశాలను సమగ్రంగా పరిశీలించారు.రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని, కేసుల దర్యాప్తుకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందుబాటులో ఉంచేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.అలాగే ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకత,సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ పరిశీలనలో డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సంబంధిత అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## పొంగిపొర్లుతున్న సంగెం బ్రిడ్జి.

## తహసిల్దార్ దశరథ ఎస్సై యుగంధర్ గౌడ్.

**వలిగొండ ఆగస్టు 04:**




యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ హైదరాబాదులో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని సంగెం బ్రిడ్జి పై వరద ప్రవాహం వేగంగా రావడంతో బ్రిడ్జిపై ప్రజలు రైతులు జాగ్రత్తగా ఉండాలని అటువైపు ఎవరు వాహనదారులు వెళ్లకూడదని వలిగొండ తహసిల్దార్ దశరథ ఎస్సై యుగంధర్ గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

# ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యంగా...

- జిల్లా ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు...మంత్రి సీతక్క
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట.. జిల్లా ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాల ప్రారంభం
- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం.. జిల్లా ఆసుపత్రిలో మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

**ములుగు, ఆగస్టు 4 ::**



విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన సదరం శిబిరం, యూడీఐడీ (UDID) భవనం, ఆక్సిజన్ ప్లాంట్, అలాగే ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ విభాగాలకు చెందిన నాలుగు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించారని తెలిపారు.జిల్లా కేంద్రంలో త్వరలోనే ప్రత్యేక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో రద్దీ ఎక్కువగా ఉన్నందున ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని, ఇదే స్థాయిని మరింత పెంచి ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించేలా అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకుంటూ, రోగులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్,

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలి.

- ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత.

**వలిగొండ ఆగస్టు 04 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.గత ఆరు సంవత్సరాల నుంచి పదివేల నాలుగు వందల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నాయి స్కాలర్షిప్లు రాక విద్యార్థులకు దూరం అవుతున్నారు. ప్రైవేటు విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మహాధర్నాలో రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు వేల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా




# వరంగల్ పశ్చిమ వైద్యాభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక చొరవ..

- మంత్రి దామోదరకు కీలక వినతి
- కాజీపేటకు 30 పడకల ఆసుపత్రి సహా పలు వైద్య ప్రాజెక్టుల ప్రతిపాదన.. మంత్రి దృష్టికి తీసుకెళ్లిన నాయిని

**హన్మకొండ, ఆగస్టు 4 ::**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పలు అభివృద్ధి ప్రతిపాదనలను తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీసుకెళ్లారు.మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సంస్థల విస్తరణ, ఆధునీకరణకు సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.కాజీపేటలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (జీఎంహెచ్) భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడంతో పాటు అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా టీబీ ఆసుపత్రికి నూతన భవనం, కొత్త అంబులెన్స్, అత్యాధునిక ఎక్స్‌రే యంత్రాన్ని మంజూరు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ ప్రతిపాదనలపై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించి, వాటిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

# అభివృద్ధి కోసము పార్టీల కతీతంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తా

- తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్

**మొమిన్ పేట్ మండలం, ఆగస్టు,04:**






జిల్లా అభివృధి కోసము పార్టీల కతీతంగా నా వంతు సహాయసహకారాలు అందిస్తానని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారము మోమిన్ పేట్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశము హాలు నందు జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు.ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ,, మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన, పూర్తి స్థాయి సమాచారం అందించాలని, శాఖల వారిగా సమస్యలు, అవసరమైన పనుల వివరాలను అందిస్తే సాద్యమైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి , ప్రజలు ఫోన్ చేస్తే తప్పని సరిగా స్పందించాలని , ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరించి వాటిని పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తున్నదని, విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు ప్రతి నియోజకవర్గంలో రెండు వందల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తుందని, ప్రతి మండలంలో ఒక పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ ఏర్పాటుతో పాటుగా గ్రామాల నుండి బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించాలని, తద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పోరేట్ విద్యను అందించాలనే ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసే విదంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని వర్షాలు కురిసినప్పుడు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోనికి ఇంకిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. దేశంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి.అయితే అతివృష్టి లేకపోతే అనావృష్టి. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటుగా, భూగర్భజలాలు పెంపొందించాలన్నారు. స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా, సోనియా గాంధీ యుపిఏ చైర్మన్ గా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు లేని కాలంలో కూలీలు వలసలు పోకుండా స్థానికంగానే ఉపాధి కల్పించడానికి పనికి ఆహార పథకాన్ని ప్రారంభించి, దానిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంగా మార్చారు.ఈ పథకంలో వంద శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే ఇచ్చేది. దీనితో గ్రామాలలో ప్రజలకు ఉపాధి దొరికింది. తదనంతరం గ్రామాలలో మిగిలిన అభివృద్ధి పనులకు MNREGS ను విస్తరించారన్నారు.ప్రతి గ్రామం నుండి మండలం వరకు రోడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారని , ఒక్కో గ్రామానికి ప్రత్యేకంగా కోటి రూపాయలు నిధులు మంజూరు చేసి, 200 యూనిట్లు కరెంటు ఇచ్చి, మహిళలకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి ,డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి, మహిళలను లక్షాదికారులనుచేయాలన్నదే మా లక్ష్యమన్నారు.వికారాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి పథకాల ద్వారా ప్రయత్నాలు చేశాను. అయితే గత ప్రభుత్వం పదేళ్ళు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది, పనులు జరుగలేదు.అయితే ప్రస్తుతం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీళ్ళు దగ్గరి ప్రాంతం వరకు వస్తున్నాయి, మాకు కూడా ఇప్పించాలని కోరగా ముఖ్యమంత్రి సరే అన్నారని , వికారాబాద్ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇచ్చే బాధ్యత నాదేనని ఈ సందర్భంగా అన్నారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై సర్పంచులు, వార్డు మెంబర్ లు పూర్తి అవగాహనా కలిగి ఉండాలన్నారు.మండల, గ్రామా పంచాయతి స్థాయి సమావేశాలు నిర్వహించి, ప్రజల సమస్యలపై ద్రుష్టి సారించాలన్నారు.ప్రతి గ్రామ ,మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే గ్రౌండ్ లెవల్లో సమస్యలు తెలుసు కోవచ్చాన్నారు. ఎలినినో వల్ల రైతులు పంట నష్ట పోకుండా కూరగాయలు, ఆయిల్ ఫార్మ్ పంటల పై ద్రుష్టి సారించేలా రైతులకు అవగాహనా కలిపించాలన్నారు.గ్రామం లో మంచినీటి సమస్య, విద్యుత్, పాత బిల్డింగ్ లు, ఆరోగ్యము పై ఉన్న సమస్యలు తెలుసుకొని , అధికారులు అందుబాటులో ఉండి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం స్పీకర్, జిల్లా కలెక్టర్ లతో స్కూల్ విద్యార్థిని లకు స్కూల్ యూనిఫామ్ అందజేశారు.సమావేశములో మార్కెట్ కమిటి చైర్మెన్ మహేందర్ రెడ్డి, జాడ్ పి సి ఇ ఓ సుధీర్, తహసిల్దార్ మున్నేర్ అహమ్మద్,సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పంచాయతి సెక్రటరీ లు గ్రామ, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు.తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ బ్యాడ్మింటన్‌కు రంగం సిద్ధం!



- బీడబ్ల్యూఎఫ్ సీడింగ్స్ విడుదల.. సింధుకు 9వ ర్యాంక్
- సాత్విక్-చిరాగ్ జోడీకి 5వ సీడింగ్
- ఆగస్టు 17 నుంచి 23 వరకు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించిన సీడింగ్స్‌ను ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య విడుదల చేసింది. మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి. సింధు 9వ సీడ్‌ను దక్కించుకోగా, పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీకి 5వ సీడింగ్ లభించింది. ఆగస్టు 17 నుంచి 23 వరకు ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగే ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరపున ఐదు విభాగాల్లో రెండేసి ఎంట్రీలు ఉండగా, నాలుగు విభాగాల్లో కనీసం ఒక్కో సీడెడ్ క్రీడాకారుడు లేదా జోడీ చోటు దక్కించుకోవడం విశేషం. పురుషుల సింగిల్స్‌లో మాజీ ప్రపంచ కాంస్య పతక విజేత లక్ష్యసేన్ 14వ సీడ్‌గా నిలవగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంటకు 15వ సీడింగ్ లభించింది. టోర్నీ అధికారిక డ్రాను బుధవారం విడుదల చేయనున్నారు. పురుషుల సింగిల్స్‌లో చైనాకు చెందిన ప్రపంచ నంబర్‌వన్ షీ యుకీ అగ్ర సీడ్‌గా బరిలోకి దిగుతుండగా, మహిళల సింగిల్స్‌లో దక్షిణ కొరియా స్టార్ అన్ సే యంగ్ టాప్ సీడ్‌గా నిలిచింది. మహిళల విభాగంలో జపాన్‌కు చెందిన అకానే యమగుచి రెండో సీడ్‌గా ఎంపిక కాగా, చైనాకు చెందిన వాంగ్ జీ యీ, చెన్ యుఫెయ్ వరుసగా మూడో, నాలుగో సీడ్లు పొందారు. పురుషుల డబుల్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన కిమ్ వోన్ హో-సియో సెయుంగ్ జై జోడీ అగ్ర సీడ్‌గా బరిలోకి దిగుతోంది. ప్రపంచ స్థాయి పోటీల్లో భారత షట్లర్లు సీడింగ్స్‌కు తగ్గట్టుగా రాణించి పతకాలతో మెరవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# 15 ఏళ్ల రూమర్లకు బ్రెట్ లీ ఫుల్‌స్టాప్!

**ప్రీతి జింటాతో ప్రేమ వ్యవహారం లేదని స్పష్టీకరణ**

**మా మధ్య ఉన్నది కేవలం స్నేహమేనన్న ఆస్ట్రేలియా మాజీ పేసర్**

**వైరల్ ప్రచారాలపై మరోసారి స్పందించిన బ్రెట్ లీ**

**ముంబై, ఆగస్టు 4 :** ఆస్ట్రేలియా మాజీ స్టార్ పేసర్ బ్రెట్ లీ, బాలీవుడ్ నటి ప్రీతి జింటాతో తనకు ప్రేమ వ్యవహారం ఉందంటూ గతంలో ప్రచారంలోకి వచ్చిన వార్తలపై మరోసారి స్పందించారు. దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించుతూ, తమ మధ్య ఉన్నది కేవలం స్నేహమేనని స్పష్టం చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన బ్రెట్ లీ, తాను ఏ బాలీవుడ్ నటితోనూ డేటింగ్ చేయలేదని తేల్చిచెప్పారు. ప్రజలు తమకు నచ్చిన విధంగా ఊహాగానాలు సృష్టిస్తారని, కానీ అలాంటి వార్తలను తాను ఎప్పుడూ పట్టించుకోలేదని అన్నారు. నిజం తనకు తెలుసు కాబట్టి ఆ ప్రచారాలు తనపై ఎలాంటి ప్రభావం చూపలేదని పేర్కొన్నారు. ఐపీఎల్ ప్రారంభ సీజన్లలో బ్రెట్ లీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్) తరఫున ఆడిన సమయంలో జట్టు సహ యజమాని ప్రీతి జింటాతో తరచూ కనిపించడంతో ఇద్దరూ ప్రేమలో ఉన్నారనే వార్తలు అప్పట్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఆ వార్తలను ఇప్పుడు మరోసారి ఖండించిన బ్రెట్ లీ, ప్రీతి జింటా భారతదేశంలో తనకు అత్యంత సన్నిహిత స్నేహితుల్లో ఒకరని చెప్పారు. ఆమె ఎంతో తెలివైన వ్యక్తి అని, ఆమెపై తనకు అపారమైన గౌరవం ఉందని వెల్లడించారు. గతంలో 2011లో కూడా ఇదే అంశంపై స్పందించిన బ్రెట్ లీ, తమ మధ్య ఉన్నది కేవలం స్నేహమేనని చెప్పగా, 2010లో ప్రీతి జింటా కూడా సోషల్ మీడియా వేదికగా ఈ ప్రచారాలను ఖండించారు. తాను ఏ క్రికెటర్‌తోనూ ప్రేమలో లేనని, అలాంటి విషయం ఉంటే తానే వెల్లడిస్తానని ఆమె అప్పట్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రీతి జింటా తన భర్త జీన్ గూడెనఫ్‌తో కలిసి కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. 2016లో వీరిద్దరూ వివాహం చేసుకోగా, 2021లో సరోగసీ ద్వారా కవలలకు తల్లిదండ్రులయ్యారు. మరోవైపు బ్రెట్ లీ 2015లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం వ్యాఖ్యాతగా, క్రికెట్ విశ్లేషకుడిగా కొనసాగుతున్నారు.

# టీమిండియాకు ఇద్దరు కోచ్‌ల గుడ్‌బై!




**రియాన్ టెన్ డస్కేట్, టీ. దిలీప్‌కు బీసీసీఐ కృతజ్ఞతలు**

**కాంట్రాక్టు ముగియడంతో సేవలకు ముగింపు**

**తదుపరి బాధ్యతల్లో విజయాలు సాధించాలని ఆకాంక్ష**

**ముంబై, ఆగస్టు 5:** భారత క్రికెట్ జట్టుకు సేవలందించిన అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కేట్, ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్‌లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వీడ్కోలు పలికింది. కాంట్రాక్టు గడువు ముగియడంతో ఇద్దరి ఒప్పందాలను పొడిగించకుండా, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్ బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించింది. శ్రీలంక పర్యటనకు భారత జట్టు బయలుదేరిన సందర్భంగా బీసీసీఐ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేసింది. భారత జట్టు విజయాల్లో రియాన్ టెన్ డస్కేట్, టీ. దిలీప్ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం, నిరంతర శ్రమ కీలక పాత్ర పోషించాయని కొనియాడింది. వారి భవిష్యత్ ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సూచనల మేరకు భారత జట్టులో చేరిన రియాన్ టెన్ డస్కేట్, ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌ల అనంతరం తన రాజీనామా సమర్పించగా, బీసీసీఐ దానిని ఆమోదించినట్లు సమాచారం. మరోవైపు ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్ కాంట్రాక్టు కూడా ముగియడంతో ఆయన సేవలకు కూడా బీసీసీఐ ముగింపు పలికింది. దీంతో భారత జట్టుతో ఈ ఇద్దరు సహాయక కోచ్‌ల అనుబంధం అధికారికంగా ముగిసింది. కొత్త కోచింగ్ బృందంపై బీసీసీఐ త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.




# యూఏఈ వేదికగా మహిళల టీ20 ఆసియా కప్

**ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు టోర్నీ నిర్వహణకు సన్నాహాలు**

**భారత్-పాకిస్థాన్ పోరుపై అభిమానుల్లో భారీ ఆసక్తి**

**షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్**

**దుబాయ్, ఆగస్టు 5:** మహిళల టీ20 ప్రపంచకప్ విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి రంగం సిద్ధమవుతోంది. మహిళల టీ20 ఆసియా కప్-2026ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా నిర్వహించేందుకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సన్నాహాలు చేస్తున్నట్లు క్రీడా వర్గాలు వెల్లడించాయి. ఈ టోర్నీ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. టోర్నీ తేదీలను ఏసీసీ ఇప్పటికే సభ్య దేశాలకు అంతర్గతంగా తెలియజేసినట్లు తెలుస్తోంది. అయితే మ్యాచ్‌ల షెడ్యూల్, వేదికల వివరాలను అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. పరిపాలనా అనుమతులు, వేదికల ఖరారు ప్రక్రియ పూర్తయిన వెంటనే పూర్తి షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మలేసియా, థాయ్‌లాండ్, యూఏఈ జట్లు పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. దీంతో మరోసారి భారత్-పాకిస్థాన్ మహిళల మ్యాచ్‌పై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడతాయన్నది షెడ్యూల్ విడుదల తర్వాత స్పష్టత రానుంది. సభ్య దేశాలకు పంపిన సమాచార ప్రకారం అన్ని జట్లు ఆగస్టు 27న యూఏఈ చేరుకోనున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. మహిళల టీ20 ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్ పూర్తి ఆధిపత్యం చాటింది. టీమిండియా ఏడు సార్లు టైటిల్‌ను కైవసం చేసుకోగా, 2024లో జరిగిన గత టోర్నీ ఫైనల్లో శ్రీలంక చేతిలో ఓటమి చవిచూసింది. ఈసారి టైటిల్‌ను తిరిగి దక్కించుకోవాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగనుంది.






# షమీకి మరోసారి షాక్!

**శ్రీలంక టెస్టు సిరీస్‌కు యువ పేసర్ అకీబ్ నబీకి అవకాశం**

**ఫిట్‌నెస్, ఫామ్‌కే పెద్దపీట.. సెలెక్టర్ల స్పష్టమైన సంకేతాలు**

**టీమిండియాలో మహ్మద్ షమీ భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి మరోసారి నిరాశ ఎదురైంది. గాయంతో శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు దూరమైన జస్ప్రీత్ బుమ్రా స్థానంలో అనుభవజ్ఞుడైన షమీని కాకుండా జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీని ఎంపిక చేస్తూ బీసీసీఐ సెలెక్షన్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో షమీ భవిష్యత్తుపై సెలెక్టర్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మహ్మద్ షమీ చివరిసారిగా 2025లో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించగా, టెస్టు క్రికెట్‌లో 2023 తర్వాత ఆయనకు అవకాశం రాలేదు. వన్డేల్లో కూడా గత ఏడాది న్యూజిలాండ్ సిరీస్ తర్వాత జాతీయ జట్టుకు దూరంగా ఉన్నారు. గాయాల నుంచి కోలుకున్న అనంతరం దేశవాళీ క్రికెట్‌లో షమీ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ జాతీయ జట్టులోకి తిరిగి రాలేకపోయారు. ఇటీవల జరిగిన రంజీ ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 37 వికెట్లు పడగొట్టి, 16.72 సగటుతో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించారు. 8/90తో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఫస్ట్‌క్లాస్ గణాంకాలు కూడా నమోదు చేశారు. అయితే అదే రంజీ సీజన్‌లో యువ పేసర్ అకీబ్ నబీ 60 వికెట్లు పడగొట్టి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 12.56 సగటుతో రాణించిన అతడికి శ్రీలంక టెస్టు సిరీస్‌కు అవకాశం దక్కింది. ఇటీవల షమీ పునరాగమనంపై స్పందించిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, టెస్టు క్రికెట్ ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ ప్రస్తుతం షమీ వద్ద లేదని పేర్కొన్నారు. దీంతో అనుభవం కంటే ఫిట్‌నెస్, దేశవాళీ ప్రదర్శనలకే సెలెక్టర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విషయం స్పష్టమైంది. భవిష్యత్తులో టెస్టు జట్టులోకి తిరిగి రావాలంటే షమీ దులీప్ ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణించడంతో పాటు పూర్తి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యువ పేసర్ల నుంచి తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో షమీ పునరాగమనం అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# షఫీక్ శతకంతో పాక్‌కు పైచేయి!

- వెస్టిండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం దిశగా పాకిస్థాన్
- 158 పరుగులతో అజేయంగా నిలిచిన అబ్దుల్ షఫీక్
- మరోసారి సెంచరీకి చేరువలోనే బాబర్ ఆజమ్ ఔట్

**ట్రినిడాడ్, ఆగస్టు 5:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో పట్టు బిగించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మెరుగైన స్థితిలో ఉన్న పాకిస్థాన్, మూడో రోజు కూడా అదే జోరు కొనసాగిస్తూ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే దిశగా అడుగులు వేసింది. ఓవర్‌నైట్ స్కోరు 266/2తో ఆట ప్రారంభించిన పాకిస్థాన్, కడపటి సమాచారం అందే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 381/7 పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్ షఫీక్ అద్భుత బ్యాటింగ్‌తో 158 పరుగుల వద్ద అజేయంగా నిలిచి భారీ స్కోరు దిశగా సాగుతున్నాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ 88 పరుగులు చేసి మరోసారి సెంచరీకి చేరువలోనే ఔటయ్యాడు. దీంతో శతకం సాధించే అవకాశాన్ని మరోసారి చేజార్చుకున్నాడు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌట్ కావడంతో పాకిస్థాన్ ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే స్థితిలో నిలిచింది. అబ్దుల్ షఫీక్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌పై పాకిస్థాన్ పట్టు మరింత బలపడింది.



# రామాయణపై అనుమానాలు

## విడుదలకు ముందే చూపిస్తే మంచిది



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. దిల్లీలోని శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉండకూడదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. 'మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రామ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందుకే ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 'రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం తమకు అందిందని, అందుకే ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్‌లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.



# డీప్‌ఫేక్ ఫొటోలపై మృణాల్ ఆగ్రహం

## తక్షణం తొలగించకపోతే చర్యలు

కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్‌ఫేక్ ఫొటోలు సెలబ్రిటీలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు నటి మృణాల్ ఠాకూర్ ఈ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్‌లోని ఒక పేజ్‌లో మృణాల్ మార్ఫింగ్ ఫొటోలు కన్పించాయి. అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. తాజాగా వీటిపై నటి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా డీప్‌ఫేక్ ఫొటోలను క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మృణాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇకపై ఈ ఫొటోలను ఎవరు షేర్ చేసినా.. వారిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గతంలో రష్మికతో పాటు పలువురు హీరోయిన్లు ఇలాంటి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్ బారిన పడిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటి ఫొటోలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా ఉండటానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# సల్మాన్ రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు

## మంచి సినిమా నిర్మించాలన్నదే లక్ష్యం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు సంబంధించి వస్తున్న వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తలను సినిమా నిర్మాతలు తాజాగా ఖండించారు. ఆ ప్రచారమంతా పూర్తిగా నిరాధారమైనదని స్పష్టం చేశారు. ఇలాంటి ఊహాగానాలపై స్పందించడం కంటే, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభూతిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మేకర్స్ పేర్కొన్నారు. ఎస్‌విసి 63'గా పిలవబడుతున్న ఈ సినిమా ప్రస్తుతం అత్యంత కీలకమైన ముంబై యాక్షన్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. 2027 ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి ముంబైలో భారీ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. దాదాపు ఆరు వారాల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో కూడిన పెద్ద ఎత్తున క్రౌడ్ సీన్స్ చిత్రీకరించనున్నారు. సెప్టెంబర్ అంతటా ఈ షూటింగ్ కొనసాగనుండగా, అక్టోబర్ నాటికి యాక్షన్ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర యూనిట్ టార్గెట్ పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ స్టంట్స్‌తో పాటు జనాల మూవ్‌మెంట్ కూడా చాలా కీలకంగా ఉండే ఈ షెడ్యూల్‌లో ప్రముఖ నటి నయనతార కూడా యూనిట్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 120 కోట్లకు పైగా రెమ్యునరేషన్ తీసుకునే సల్మాన్ ఖాన్, ఈ సినిమా కోసం దానిని సుమారు 70 కోట్లకు తగ్గించుకున్నారని, నిర్మాత రఫీ కాజీతో ఉన్న స్నేహం కారణంగానే ఈ ఫీజు తగ్గింపు జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ, ఇప్పుడు మేకర్స్ ఆ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు.

# ఫౌజీ కోసం భారీ చార్మినార్ సెట్

## నిరంతరాయంగా షూటింగ్ కోసం ప్లాన్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి-లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

# శూర్పణఖ పాత్ర సంక్లిష్టమైనది: రకుల్

మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి రకుల్ ప్రీత్ సింగ్ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను కేవలం ఒకే ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. ఒక నటిగా ప్రేక్షకుల్లో ఇప్పటికే ఉన్న పాత ఆలోచలను, అభిప్రాయాలను మార్చేలా ఉండే వైవిధ్యమైన పాత్రలు చేయడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒకే చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానని ఆ పోస్ట్‌లో పేర్కొంది.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848899998, editor@churakalu.com